ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
11 డిసెంబర్, 2011

Entered

# అగ్రరాజ్యం ఉగ్రదాడులు

# హ్యాపీబర్త్‌డే

(2011 డిసెంబర్ 11నుంచి
2011 డిసెంబర్ 17 వరకు)

**జశ్వితారెడ్డి**
1 సం॥, డిసెంబర్-2010
విజయలక్ష్మి-సుబ్బారెడ్డి
రెంటచింతల-గుంటూరు

**సూర్యతేజారెడ్డి**
1సం॥, డిసెంబర్-12
సుజిత-నర్సింహారెడ్డి
చింతల్-హైదరాబాద్

**ధృవ శిశిర**
2సం॥, డిసెంబర్-11
అనిల-రమేష్
కాజ-గుంటూరు

**బి. జతిన్**
6సం॥, డిసెంబర్-12
వేణుకుమారి-వెంకటేశ్వరరావు

**టి.నందు**
3 సం॥, డిసెంబర్-2008
సునీత-భాస్కర్
యల్లాయపాళెం-నెల్లూరు

**పి.హసిత**
8సం॥, డిసెంబర్-11
మాలతి- భాస్కరరావు
విశాఖపట్నం



**ఇ. వైష్ణవ్**
1సం॥, డిసెంబర్-2010
కనకదుర్గ-నవీన్
సత్తెనపల్లి-గుంటూరు



**బి. శ్రీచరణ్‌రాజ్**
3సం॥, డిసెంబర్-2008
లావణ్య - దామోదర్
అస్మత్‌పూర్-రంగారెడ్డి

**ఎం. డి. అబ్దుల్లా**
6సం॥, డిసెంబర్-2005
ఇస్మాల్‌బీ-ఎం.డి. సలీం
జహీరాబాద్-మెదక్

**సిహెచ్. నిహారి**
10సం॥, డిసెంబర్-2001
సునీత-గోపి
మామిడికుదురు-తూ॥గో

**కె.రిషిక్**
డిసెంబర్-13
వెంకటలక్ష్మి- వెంకటేశ్వరరావు
మామిడికుదురు-తూ॥గో

**ఎం. షణ్ముఖసాయి**
6సం॥, డిసెంబర్-14
రాజ్యలక్ష్మి-శ్రీను
బాపట్ల-గుంటూరు

మనలో మాట

# కొలువుల లొల్లి

కొలువులు బాబోయ్ కొలువులు. సర్కారీ కొలువులు. అల్లంత దూరాన నిలబడి తెగ ఊరిస్తున్నాయ్. ఉడికిస్తున్నాయ్. వెక్కిరిస్తున్నాయ్. గేలిచేస్తున్నాయ్. అన్ని వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లంటే మాటలా! సంతోషంతో పిచ్చెక్కిపోతుంటేను. ఉత్కంఠతో ఊపిరి సలపక పోతుంటేను. వెర్రి కాకపోతే! ఇన్నేళ్ల నిరీక్షణ ఈ క్షణం కోసం కాదూ! ఒకటి కాకపోతే మరొక కొలువైనా వరించకపోతుందా? కష్టాల కడలిని ఒక్క అంగలో దాటకపోదుమా! నింగికెగసిన నిత్యావసరాలను అందుకోకపోదుమా? చెల్లికి కళ్యాణం, అమ్మకు వైద్యం చేయించకపోదుమా! అన్న ఆశతోనే నిరుద్యోగ సైన్యం సన్నద్ధమౌతోంది. రాత్రింబగళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతూ మెదడుకు పదును పెడుతోంది. ముందస్తు జాగ్రత్తతో శిక్షణ తీసుకొంటోంది. అప్పోసప్పో చేసి మరీ వేలల్లో ఫీజులు కడుతోంది. అందుకవసరమైతే నట్టింట్లో మిగిలిన చివరాఖరి వస్తువును సైతం కుదువ పెడుతోంది.

నిరుద్యోగులకు కొలువుల మాట పెరుమాళ్లకెరుక! ట్రైనింగ్ సెంటర్లు మాత్రం కళకళలాడుతున్నాయ్. వేలల్లో ఫీజులు దండుకుంటున్నాయ్. ఎండమావులుగా మారిన కొలువులను ఎరగా చూపి కాసులు పోసుకుంటున్నాయ్. లాభాల పంట పండించుకుంటున్నాయ్.

కొలువులపై నేతల లేలేత కోతలు కొత్తవేం కాదుగా. వారికి నిరుద్యోగులు, యువతే కదా ఓటు బ్యాంకులు. వాటికోసం ఎన్ని నోటిఫికేషన్లయినా ప్రకటిస్తారు. ఎన్ని హామీలైనా గుప్పిస్తారు. ఇచ్చిన హామీలనే మార్చి మార్చి ఏమార్చి సరికొత్తగా ఇస్తారు. కాకపోతే ఒక్కో నోటిఫికేషన్‌కు పంచవర్ష ప్రణాళిక వేసుకొని మరీ పూరిస్తారు.

ఏదేమైతేనేం! గతంలో ఎన్ని బస్సులు మిస్సయితేనేం! ఈసారైనా కొలువుల కోచ్‌ను క్యాచ్ చెయ్యాలన్నదే యువత కోరిక. అయితే... దాన్ని క్యాచ్ చేసే లోపు ఏజ్ బార్ అయిపోయేవారిని తల్చుకుంటేనే ...మనసు మూల్గుతుంది బాధతో. సరిగ్గా అదే సమయంలో అనిపిస్తుంది. 'పలికలకూ మనసుంటే ఎంత బావుండు' అని.

★

## ఈ సంచికలో....


| | | |
|---|---|---|
| టపా | ... | 2 |
| కవిత్వమ్ | ... | 4 |
| ఎవరి గోల వారిదే | ... | 6 |
| చూద్దామా | ... | 12 |
| అట్టమీది కథ | ... | 14 |
| వికాసం | ... | 20 |
| రుచి | ... | 21 |
| బాలనేస్తాలు | ... | 22 |
| మాటల కోట | ... | 24 |


### ఇంకా...


ఈ పేజ్ .... 3
సరికొత్త ఫీచర్లతో యూట్యూబ్

కథ ... 8
ఆ చేతి చేత...

ప్రత్యేకం... 10
జీవిత నాటకం కన్యాశుల్కం

సినిమా కబుర్లు ... 18
నిత్య నవకేతన ప్రేమతార



## కనువిందు

అట్టమీది కథ 'మైనింగ్ మాఫియా' నిజాలను బట్టబయలు చేసింది. 'ఆరోగ్యం' శీర్షిక ద్వారా ఎయిడ్స్ బాధితులలో స్థైర్యం నింపే ప్రయత్నం హర్షించదగింది. సొంతవైద్యం ఎప్పటికైనా ప్రమాదకరమేనని 'వికాసం' ద్వారా శర్మ తెలియజేశారు. 'బాల నేస్తాలు'లో చాతక పక్షి విశేషాలు తెలుసుకున్నాం. 'వంటింటి నేస్తాలు' కనువిందు చేశాయి. కవితలన్నీ బాగున్నాయి. 'ఎవరిగోల వారిదే'లో చెప్పినట్లు ఒబామా విషయాన్ని మేమూ ఏకీభవిస్తున్నాం. నాటి ప్రముఖ రచయితల 'పాతకథ'లు అందించడం ఆనందంగా ఉంది. కె.ఎక్స్.రాజు అందిస్తున్న 'ఈ పేజ్' వ్యాసాలు ఎంతో ఉపయోగంగా ఉంటున్నాయి. గురజాడ వంటి విశిష్ట వ్యక్తిని తెలకపల్లి రవి వ్యాసం ద్వారా జ్ఞాపకం చేసుకున్నాం. 'మాటలకోట' బాగుంటోంది. అనూష అందించిన ఉసిరి వంటకాలు నోరూరించాయి. 'మనలోమాట' చదువుతుంటే మగవాళ్ల స్వయంకృతాపరాధం అంటే ఇదేననిపించింది.

**నేమాన సుభాష్‌చంద్రబోస్, శ్రీకాకుళం.**

## ఈనాటిది కాదు

'ఈ పేజ్'లో ఆన్‌లైన్ తెలుగు రేడియో విశేషాలు వెనుకటి రోజులను గుర్తు తెచ్చాయి. పూర్వం రేడియోకున్న ప్రాముఖ్యత చెప్పతరం కాదు. నేటి తరానికి ఎఫ్.ఎమ్ అంటే ఎంతిష్టమో నాటి తరానికి ఆకాశవాణి అంటే అంతిష్టం. అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, ఇండియా కార్యక్రమాలను సమయానుకూలంగా వినొచ్చని తెలిసింది.

**నూతి నారాయణరావు, గద్దిఅన్నారం.**

## ఆలోచింపజేసిన 'మాఫియా'

కవర్ స్టోరీ 'మైనింగ్ మాఫియా' సవివరంగా ఉంది. అన్ని రాష్ట్రాల్లోనూ గనుల మాఫియాలున్నాయి. వీటికి రాజకీయ అండతోపాటు, ప్రభుత్వ భాగస్వామ్యం కూడా ఉంటోంది. వీటి కనుసన్నల్లోనే మంత్రులు, ఎమ్మెల్యేలు మెలగాల్సి వస్తోంది. వీటి వల్ల ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల్లో నష్టం వస్తున్నా పట్టించుకోవట్లేదు. ఎవరి వాటాలు వారివే అన్నట్లుంది. ఆలోచింపజేసే వ్యాసాన్ని అందించారు. ఎయిడ్స్ వ్యాసం చదివాక ఈ వ్యాధి గురించి మరింత అవగాహన కలిగింది. అలాగే గతవారం 'అట్టమీది కథ'లో సంజీవ్ భట్ గురించి, ఆయన చేసిన న్యాయ పోరాటం గురించీ చక్కటి వివరాలు అందించారు.

**టి. శ్రీరామమూర్తి, విశాఖ.**

## గురివింద నలుపు

పాత కథలనే తిరిగి అందించడం బాగుంది. ఈవారం 'ఇంగువ' కథ పాత మిత్రులను గుర్తు చేసింది. ఇంగువ గురించి తెలుసుకోకుండానే రాజశేఖరం చనిపోవడం, స్నేహితుడు కూడా ఇంగువ గురించి చెప్పలేకపోవడం బాధ కలిగించింది. తేనె మాటల గురజాడ గురించి తెలకపల్లి రవి అందించిన వ్యాసం ఎంతో ఆనందాన్నిచ్చింది. ఎందెందు లాభాలుంటాయో అందందు మాఫియాలుంటాయని ఈ వారం 'అట్టమీద కథ' మైనింగ్ మాఫియా తెలియజేసింది. మాట్లాడ్డంలోనే స్వేచ్ఛలేని మనిషి ఇతరుల స్వేచ్ఛ గురించి మాట్లాడ్డం విడ్డూరంగా అనిపిస్తుంది. ఒబామాకు ఇది సరిగ్గా సరిపోతుంది. గురివింద తన

నలుపు గురించి తెలుసుకోలేదని ఎం. కోటేశ్వరరావు 'ఎవరిగోల వారిదే'లో చక్కగా చెప్పారు. సర్వేశ్వర శర్మ 'సొంత వైద్యం కొంత మానుకో...', ఎన్నో విషయాలను తెలియజేసింది. అలాగే గతవారం 'కల్తీ కబుర్లు' కల్తీ ఉచ్చు నుండి తప్పించుకోడానికి ఉపయోగపడతాయి. పెట్టుబడిదారీ



సామ్రాజ్యంలో లాభాలే ప్రధానం. ప్రజల ఆరోగ్యం కాదు. పెట్టుబడిదారీ వర్గాలే కల్తీని ప్రోత్సహిస్తున్నాయి.

**ఇలిపిల్ల సూర్యనారాయణ, విజయవాడ.**

## ఉసిరి రుచులు

'సొంత వైద్యం కొంత మాని...' వ్యాసం బాగుంది. అట్టమీది కథ 'మైనింగ్ మాఫియా' అనేక విషయాలను తెలియజేసింది. ఉసిరి రుచులు బాగున్నాయి. తెలకపల్లి రవి గురజాడ వ్యాసం అలరించింది. గురజాడ గురించి ఎన్నో విషయాలను తెలుసుకున్నాం. నేడు ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా తెలుగు కనుమరుగైపోతోంది. మాతృభాషని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఎయిడ్స్ ప్రాణాంతక వ్యాధి కాదంటూ ఎన్నో వివరాలు తెలిపారు. విదేశాల్లో చిచ్చుపెట్టే రోగం అమెరికాకు ఎప్పుడు పోతుందో ఏమో!?

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**






ఒకప్పుడు కొత్త టెక్నాలజీ ప్రజలకు అందుబాటులోకి వచ్చేందుకు కొన్ని సంవత్సరాలు పట్టేది. ప్రస్తుతం ఏ టెక్నాలజీ వచ్చినా కొద్ది రోజుల్లోనే కోట్లాదిమందికి చేరువవుతోంది. ఇంటర్నెట్ గురించి చెప్పాలంటే కేవలం నాలుగేళ్ళలోనే ప్రజలకు చేరువయ్యింది. ఇంటర్నెట్‌లో అత్యధికంగా ఉపయోగించే వెబ్‌సైట్లలో రెండోస్థానంలో వున్న ఫేస్‌బుక్ సైట్లో కేవలం ఏడాదిలోపు 20కోట్ల మంది రిజిస్టర్ చేసుకున్నారు. కాగా, యూట్యూబ్ మూడోస్థానంలో ఉంది. ఈ యూట్యూబ్ ఎప్పటికప్పుడు వినూత్న సాంకేతిక విలువలతో వినియోగదారులను ఆకట్టుకుంటోంది. అలాంటి యూట్యూబ్ ప్రస్తుతం సరికొత్త ఫీచర్లతో కళకళలాడిపోతోంది. ఆ వివరాలు...




# సరికొత్త ఫీచర్లతో యూట్యూబ్

ఆరేళ్ళు పూర్తిచేసుకున్న 'యూట్యూబ్' వెబ్‌సైట్‌ను 2006లో సుమారు 1.76 బిలియన్ డాలర్లకు సెర్చ్ ఇంజన్ జెయింట్ గూగుల్ కొనుగోలు చేసింది. ఆ తర్వాత యూట్యూబ్‌లో గూగుల్ చాలా మార్పులు, చేర్పులు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు కొత్తగా యూట్యూబ్‌లో ఓ సరికొత్త ఆప్షన్‌ని జత చేసింది. ఎక్కువ మంది వినియోగదారులను ఆకట్టుకునేందుకు కొత్తగా టీవీ ఛానళ్లకు అనుసంధానంగా పనిచేసే ఫీచర్‌ని ఇందులో నిక్షిప్తం చేసింది. దీనిద్వారా వినియోగదారులు కేబుల్ టీవీ మాదిరిగా యూట్యూబ్‌ని కూడా చక్కగా ఎంజాయ్ చేయవచ్చు. ఈ కొత్త ఫీచర్ ద్వారా యూట్యూబ్ డిస్‌ప్లే విధానమే మారనుంది. ఇందులో మూడు కాలమ్స్ మాదిరి కనిపిస్తుంది. ఎడమ వైపునున్న కాలమ్‌లో యూజర్లు తమకు కావాల్సిన, నచ్చిన ఫేవరేట్ వీడియోలను, ఛానళ్లను చూస్తుండడమే కాకుండా, నచ్చిన వీడియోలను స్నేహితులకు ఫేస్‌బుక్, సోషల్ నెట్ వర్కింగ్ ద్వారా పోస్ట్ చేయవచ్చు. ఇది ఇలా ఉంటే ఇటీవలే యూట్యూబ్ తన ఆన్‌లైన్ మూవీలను అద్దెకిచ్చే సర్వీసుని జపాన్‌కు విస్తరించిన సంగతి తెలిసిందే.

**1,500 సినిమాలు :** భారతీయ సినిమాలను గూగుల్ అభిమానులకు ఓ పెద్ద మూవీ కలెక్షన్‌గా అందించనున్నట్లు గూగుల్ ఇండియా బ్లాగులో వెల్లడించింది. ఇండియా మొత్తం మీద విజయవంతమైన సినిమాలను అన్ని భాషల్లో కలిపి సుమారు 1,500 వరకు ఇందులో వుంచారు. ఇండియన్ సినిమాల కోసం గూగుల్ ప్రత్యేకంగా ఓ పేజీని కూడా రూపొందించింది. ఇలా గూగుల్ కొత్త సినిమా పేజీని రూపొందించడానికి కారణం ఇండియన్ సినిమా అభిమానులకు ఉత్తమమైన, నాణ్యమైన సినిమాలను అందించడమే కాకుండా, పైరసీని అరికట్టేందుకు కూడా ఇది ఉపకరిస్తుందని గూగుల్ ఇండియా తన బ్లాగ్‌లో తెలిపింది. కొత్త యూట్యూబ్ సినిమా పేజీని చూడాలంటే http://www.youtube.com/movies/indi-an-cinema క్లిక్ చేయాలి. దీని ద్వారా ఇండియాలో ఉన్న అన్నిభాషలకు సంబంధించిన సినిమాలతో పాటు, రాబోయే కాలంలో యూట్యూబ్‌లోకి రానున్న సినిమాల విషయాలను కూడా తెలుసుకోవచ్చు.

**3డి వీడియో :** త్వరలో 3డి వీడియో ఆప్షన్‌ని ప్రవేశపెట్టనుంది. యూ ట్యూబ్ ప్రవేశపెట్టనున్న ఈ 3డి వీడియో యూజర్లు అప్‌లోడ్ చేసిన కంటెంట్‌ని 3డి వీడియో ఫార్మెట్లోకి మారుస్తుంది. ఒక్కసారి కంటెంట్‌ని 3డి ఫార్మెట్లోకి మార్పు చేసిన తర్వాత యూజర్లు ఆ వీడియోని వీక్షించాలంటే తప్పనిసరిగా 3డి గ్లాస్‌లను దగ్గర పెట్టుకోవాల్సిందే. గతంలో యూజర్లు అప్‌లోడ్ చేసిన 2డి వీడియోలను డైరెక్టుగా 3డి వీడియోలుగా మార్చడం కోసం యూట్యూబ్ వెబ్‌సైట్ ప్రత్యేకంగా 'ఎడిట్ ఇన్ఫో' అనే బటన్‌ని రూపొందించడం జరిగింది. గతంలో ఈ 3డి వీడియో మీద యూట్యూబ్ ప్రయోగాలు చేసినప్పటికీ ఇంత ఆలస్యం కావడానికి కారణం 3డి రికార్డింగ్ డివైజెసేనని నిపుణులు చెపుతున్నారు. 3డి ఇమేజిలను రికార్డ్ చేసేందుకు మోషన్ పిక్చర్ కెమెరాని, సిస్టమ్‌ని ఉపయోగించారు. వినియోగదారుల కోసం ఈ 3డి ఆప్షన్‌ని విడుదల చేస్తామని 2009లో చెప్పినమాటను యూట్యూబ్ ఇప్పుడు నిలబెట్టుకోనుంది.

**డౌన్‌లోడ్ & అప్‌లోడ్ :** ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్న యూట్యూబ్... ఇంటర్‌నెట్‌లో వీడియోలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. వెబ్‌సైట్‌లో వీడియో పెట్టాలన్నా, బ్లాగ్‌లో లింక్‌లు ఇవ్వాలన్నా ఏకైక మార్గం యూట్యూబ్. యూ ట్యూబ్ అనేది ఆన్‌లైన్‌లో వీడియోలను పంచే వెబ్‌సైట్. గూగుల్ అకౌంట్ ద్వారా ఈ సైట్‌లోకి వీడియోలను అప్‌లోడ్ చేయవచ్చు. ఇతరులతో పంచుకోవచ్చు. 2005లో ప్రారంభమైన ఈ సైట్ ఆరేళ్లల్లోనే ఇంటర్‌నెట్ వినియోగదారులందరికీ పరిచయమైంది. పేపాల్ వెబ్‌సైట్ మాజీ ఉద్యోగులైన చడ్ హుర్లె, స్టీవ్ చెన్, జావేద్ కరీం కలిసి ఫిబ్రవరి 2005లో ఈ సైట్‌ని రూపొందించారు. దీనికి లభిస్తున్న ఆదరణని గమనించిన గూగుల్ నవంబర్ 1, 2006న దీన్ని కొనుగోలు చేసింది. ఇది అడోబ్ ఫ్లాష్ వీడియో ఆధారంగా పనిచేస్తుంది. మొట్టమొదట యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన వీడియో 'మీ ఎట్ ది జూ'. దీని రూపకర్తల్లో ఒకరైన జావెద్ కరీం 'సాన్ డిగో జూ'కు వెళ్లినప్పుడు తీసిన వీడియో ఇది. దీన్ని ఇప్పటికీ ఈ సైట్‌లో చూడొచ్చు. 2011, ఫిబ్రవరి లెక్కల ప్రకారం యూట్యూబ్‌కు 490 మిలియన్ల మంది వినియోగదారులున్నారు. రోజుకు 3బిలియన్లు, నెలకు సుమారు 92 బిలియన్ల మంది ఈ సైట్‌ను చూస్తున్నారు. యూట్యూబ్‌కు 10వేల మంది అడ్వర్టయిజ్‌మెంట్ భాగస్వాములున్నారు.

యూట్యూబ్ నుంచి వీడియోలు ప్లేచేసి చూసుకోవడమే కాదు, నచ్చినవాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అయితే అది యూట్యూబ్ సైట్ ప్రైవసీ పరిమితులకు లోబడే వుండాలి. యూట్యూబ్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడానికి డౌన్‌లోడర్ 9, కీప్‌విడ్, ఈజీ యూట్యూబ్ డౌన్‌లోడర్, ఐ డెస్క్‌టాప్, టీవీ, వీడియో డౌన్‌లోడ్ ఎక్స్, సేవ్ ట్యూబ్, వీడియో గెటింగ్, ఆర్బిట్ డౌన్‌లోడర్, మోయ యూ ట్యూబ్ డౌన్‌లోడర్, విడౌన్ లోడర్, వీడియో స్లర్ప్, డెస్క్‌టాప్ యూట్యూబ్ డౌన్‌లోడర్, యూట్యూబ్ డౌన్‌లోడ్, క్లోన్ 2 గో ఫ్రీ యూట్యూబ్ డౌన్‌లోడర్- ఇలా ఎన్నెన్నో సాఫ్ట్‌వేర్‌లు ఇంటర్నెట్‌లో లభిస్తున్నాయి. వీటిలో కొన్ని ఫ్రీగా లభిస్తున్నాయి. ఉదాహరణకు, ఫ్రీ యూట్యూబ్ డౌన్‌లోడర్ అండ్ కన్‌వర్టర్‌ను వాడి ఆన్‌లైన్ మూవీలను, మ్యూజిక్‌ను యూట్యూబ్ నుంచి FLV, Mp4, 3gp ఫైళ్లుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే, యూ ట్యూబ్ FLV ఫైల్స్‌ని avi లేదా MPG ఫైల్‌గా మీ మొబైల్ ప్లేయర్‌లో వాడే విధంగా కన్వర్ట్ చేసుకోవచ్చు. 'క్లోన్ 2 గో' అనేది ఫ్రీ సాఫ్ట్‌వేర్. యూట్యూబ్ డౌన్‌లోడర్ అనే ఫ్రీసాఫ్ట్‌వేర్ బాగా పాపులర్ అయ్యింది. దీనిద్వారా MOV, MP4, 3GP, WMV, AVI లేదా MP 3 ఫార్మెట్లలో సేవ్ చేసుకోవచ్చు. 'ఫ్రీ కార్డర్ 5' అనేది ఫ్రీవీడియో డౌన్‌లోడర్‌గా, ఆడియో రికార్డర్ కన్‌వర్టర్‌గా పేరుపొందింది. ఇది వందలకొద్దీ ఫ్రీగా లభిస్తున్న వెబ్ రేడియో స్టేషన్‌ల నుంచి సంగీతాన్ని ఆస్వాదించే వీలునివ్వడమే కాకుండా, ఆ ప్రోగ్రామ్‌లను రికార్డు చేసుకొనే సదుపాయాన్నీ కల్పిస్తోంది. 'ఫ్రీకార్టర్ 5'ను http//www.applian.com/freecorder5/ నుంచి పొందవచ్చు. అదేవిధంగా యూట్యూబ్‌లోకి అప్‌లోడ్ చేసేందుకు డబ్ల్యూమ్‌వి, ఎవిఐ, ఎంకెవి, ఎంఒవి, ఎంపెగ్, ఎంపీ4, ఎఫ్ఎల్‌వి, ఒజీజీ. 3జిపీ వంటి వీడియో ఫార్మెట్లనూ అనుమతిస్తోంది. దీని ద్వారా మొబైల్ ఫోన్‌లో కూడా వీడియోలను చూడవచ్చు.

**- కె.ఎక్స్.రాజు**

# పఠనాసక్తి లేని సమాజం పాడుపడ్డ దేవళమే!!



కవితా సంపుటాలు
ఈమధ్య కాలంలో
కోకొల్లలుగా
వెలువడుతున్నాయి
వాటి వెలలు తక్కువే
అయినా అవి జనాల
మధ్య పఠనయోగ్య
మైనా, ఎందుకో
చేరలేకపోతున్నాయి!
కవితల్లో వాస్తవికత
లోపించిందా?
సమకాలీన సమస్యలు
వాటిల్లో కొరవడినయ్యా?
సమీక్షకులు కొరవడ్డారా?
చర్చ జరిపితే కవుల్లోను
వాళ్ల కవితల్లోనూ మార్పులు రావా?
ఇంతకు చదువుకున్న
చదువు 'కొన్న' మేధావుల
ఇళ్లల్లో ఓ పాతిక పుస్తకాలు
బీరువాలోనో డ్రాయింగ్ బల్ల మీదో
దర్శనమిచ్చిన, పాపాన పోవెందుకో?
తరచి తరచి చూస్తే
పఠనానికి సమయమేది?
కిందస్థు నుంచి పై అంతస్థుకి
శ్రమించకుండా కుబేరులవ్వాలనే
ఆరాటంలో, ఆ దురాశా జీవన
వ్యాపారులలో, శరీరానికి
మనస్సుకు తీరికే లేదే?
సమాజం ఎటు పోయినా
దేశంలో రాజకీయంలో
తన చాతుర్యంతో ఎదుటివాడి బాగు బొగ్గైనా
అది తన ధనాగారం నింపాలి
ఇదే స్వార్థ చింతన
సరళీకృత ఆర్థిక
వ్యవస్థలో తాను
దోచుకోటానికి
మార్గాలెతుక్కునే
వాతావరణంలో
వ్యక్తి తన స్వేచ్ఛనే తప్ప
పొరుగువాడి దైన్యస్థితిపై
ఒక నిమిషం ఆలోచించే
తీరికలేని నేటి వ్యక్తికి
కథలు, కవితలు, కళలు
వాటిని గురించి చింతన
చేసే తీరిక కొరవడింది
ఇది తన సమాజానికి
తన దేశ భవిష్యత్తుకు
రాబోయే విపత్తు
కించిత్తైనా తెలియాలంటే
పఠనంపై ఆసక్తి పెరగాలి
పఠనాసక్తి లేని సమాజం
పాడుబడ్డ దేవళమే!!

- రామిశెట్టి రోశయ్య

# మూగరోదన

నోరున్నోడిదే ఊరు!
స్వార్థం నేర్పిన ఊరు ఉప్పెనై
తెలివిని తెగనమ్మిన మనిషి మృగమై
ప్రకృతిని పాదాక్రాంతం చేసుకుని
పాతాళానికి నెడుతుంటే...
మూగజీవులు ముక్కున వేళ్లేసుకుంటున్నాయ్
ఉనికిని కోల్పోయిన పశుపక్ష్యాదుల ఆక్రందనలు
ఆకాశానికెగస్తుంటే...
ఆశ చావని మనిషి దానవుడై
నింగిని- నేలని
కొండల్ని - కానల్ని
ఆనవాళ్లు లేకుండా అంతమొందిస్తుంటే...
అడవి అందం
అడవికాచిన వెన్నెలైంది
పాడి పశువు
పుష్టిగుంటే పెంపకం
వట్టిపోతే వధ్యశాలకు
అంపకం
శివమెత్తుతోన్న
సాంకేతిక పరిజ్ఞానం
చిటారుకొమ్మల్ని
చిదిమేస్తూ సెల్‌టవర్ల
నిర్మాణం
శిలువ వేయబడుతోన్న అల్పజీవుల ప్రాణం
కాకమ్మ కబుర్లు.... పిచ్చుకమ్మ గెంతులు
కాగడా పెట్టి వెదకినా కానరాని గురుతులు
క్రూరమృగాలనూ 'కూర' మృగాలుగా మర్చేస్తూ
కునారిల్లుతోన్న మానవప్రవృత్తి
ప్రాణభయంతో మూగజీవాల రోదన
ప్రాణాధికంగా మారిన ధనదాహంతో
మనిషి గుండె నిరంతరాన్వేషణ
ప్రకృతి ఒడిలో పరవశం స్థానే పాశవికం
వికృతి ఎన్నటికీ వినాశనానికే కారకం

- ఇల్ల ప్రసన్న లక్ష్మి

కవిత్వమ్



# నానీలు

భూములిచ్చారు
బికారులయ్యారు
ఫ్యాక్టరీలు కట్టారు
కుబేరులయ్యారు
*
వ్యవసాయం
దండగట...
కార్పొరేట్ కిస్తే
పండగ

మంచు కొండల్లో
జై జవాన్
ముంచిన అప్పల్లో
జై కిసాన్
*
రాయితీలు
కార్పొరేట్లకు
పన్నులు
పేదలకు
*
వదలని
ముసురు
ఉపాధికి
ఎసరు
*
ఒకప్పుడు
ఎస్టేట్లు
ఇప్పుడు
సెజ్‌లు

- చల్లా విశ్వనాథం

# SPEAK ENGLISH FLUENTLY

**6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.**

**తెలుగు తెలిస్తే చాలు...**
**ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు**



K.V.R. B.Com., B.L., (Director)

## రోజుకు ఒక గంట చాలు...
## సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.



స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

**కూపన్ పంపండి లేదా SMS పంపండి.**

**CHENNAI: 0-97890 99589**

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం. ఊరిపేరు, ఫోన్ నెం, పిన్‌కోడ్‌లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. మా సెల్‌ఫోన్ 24 గంటలూ కంప్యూటర్‌కు లింక్ చేయబడి ఉంటుంది. మీ అడ్రసు ఆటోమేటిక్‌గా కంప్యూటర్ రిసీవ్ చేసుకుంటుందని తెలుసుకోగలరు. కోర్స్ ఫీజు రూ.1000/-లు. ఇది 5 నెలల కోర్స్, రోజూ ఒక గంట చదివితే చాలు. ఈ కోర్సులో 10 పుస్తకాలు, 1 CD ఉంటాయి. మీకు ఏమయినా సందేహాలు ఉంటే, లెటరు వ్రాసి తెలుసుకోవచ్చు. 10 రోజులలో పోస్ట్‌మేన్ కోర్స్ ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి కోర్స్ మెటీరియల్ పొందవచ్చును. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

**ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.**

H.O.CHENNAI

KVR INSTITUTE™

AWARD WINNER

**New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.**

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ........................................................................

Address: ....................................................................

..................................................................Pin Code: ______

**ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు:** ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502. **Cell:**98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:**93915 49930. ● **DHONE:**Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

**ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.**

ఎవరి గోల వారిది

# దౌర్భాగ్యం x దౌర్బల్యం

అమెరికాలో ఉన్న ఇల్లు, ఉద్యోగం పోయి వీధులపాలై ఆహార కూపన్ల కోసం సిగ్గు విడిచి చేతులు చాస్తున్న అభాగ్యులు ఒకవైపు ! చేతి నిండా ఉన్న సొమ్మును ఎలా ఖర్చు పెట్టాలో తెలియక లక్షల డాలర్లు తగలేస్తున్న కార్పొరేట్ ప్రబుద్ధులు మరొకవైపు !! 1938లో ప్రచురితమైన "యాక్షన్ కామిక్స్" అనే మ్యాగజైన్ తొలి ప్రతిని వేలం వేయగా దాని అసలు ధర కేవలం పది సెంట్లు (డాలరుకు వందసెంట్లు) కాగా 21.6లక్షల డాలర్లకు (డాలరు విలువ 52 రూపాయలు) గతనెల 30న ఒక అమెరికన్ ప్రబుద్ధుడు కొనుగోలు చేశాడట. సూపర్‌మాన్ చిత్రానికి తొలి రూపకల్పన ఈ మ్యాగజైన్‌లోనే జరిగింది. ప్రారంభ ధర ఒక డాలరుగాను , గరిష్ఠ ధర తొమ్మిది లక్షల డాలర్లుగా దాని యజమాని నవంబరు 11న షరతు విధించాడు. గతేడాది ఇదే పుస్తకాన్ని 10లక్షల డాలర్లకు విక్రయించగా ఇప్పుడు 21లక్షలు దాటి రికార్డు సృష్టించింది. ఇంతకు ముందు 1992లో ఒక పుస్తకాన్ని 86వేల డాలర్లు, 1997లో మరొక పుస్తకాన్ని లక్షా 50వేల డాలర్లకు కొన్న వారు తామే రికార్డులు సృష్టించామనుకున్నారు. తమకంటే తెలివి తక్కువవారు ఉన్నారని గ్రహించలేకపోయారు. ఇప్పుడు రికార్డు ధరలో అమ్ముడు పోయిన యాక్షన్ కామిక్స్ పుస్తకం 2000 సంవత్సరంలో చోరీ అయి, ఈ ఏడాది ఏప్రిల్‌లో కాలిఫోర్నియాలోని ఒక షెడ్డులో దొరికిందట.

**కొందరికి మోదం ఎందరికో ఖేదం**

తగ్గిపోతున్న రూపాయి విలువతో ఒకవైపు ప్రభుత్వం, బ్యాంకింగ్ రంగం బెంబేలెత్తుతోంది. మరోవైపు తాము కష్టపడి సంపాదించిన సొమ్ముకు అనుకోకుండా అదనంగా రూపాయలు వస్తున్నాయని ప్రవాస భారతీయులు, ఎగుమతిదార్లు సంతోషిస్తున్నారు. రూపాయి విలువ తగ్గిన తరువాత మధ్యప్రాచ్య(గల్ఫ్) దేశాల నుంచి మన దేశానికి 25శాతం నగదు బదిలీ పెరిగిందని అంచనా. గల్ఫ్‌లో ప్రవాస భారతీయుల్లో సగం మంది కేరళవాసులే. అయితే రూపాయి విలువ బ్యాంకులకు చిక్కులు తెచ్చి పెడుతోందని అంటున్నారు. ఎందుకంటే ప్రవాస భారతీయుల ఖాతాలలో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లకు చెల్లించాల్సిన అదనపు మొత్తం అనూహ్యంగా 49వేల కోట్ల రూపాయలు ఉంటుందని ఎస్ఎంసి గ్లోబల్ సెక్యూరిటీస్ అనే సంస్థ అంచనా వేసింది. ఈ ఏడాది జులై నుంచి డాలర్‌తో మన రూపాయి మారకపు విలువ 18 శాతం పడిపోయింది. ప్రవాస భారతీయుల ఫిక్స్‌డ్ డిపాజిట్ల మొత్తం 5289.7 కోట్ల డాలర్లు కాగా వచ్చే ఏడాది జూన్ 30 నాటికి గడువు తీరే మొత్తం 4343.4 కోట్ల డాలర్లట. అందువలన వాటికి అనుకున్నదాని కంటే అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు మన బ్యాంకులకు నష్టమే. ఈ ఏడాది పారుబాకీలు 50వేల కోట్లయితే పులిమీద పుట్రలా ఇదొక అదనపు నష్టం.

**పిల్లల బట్టల విలువెంత?**

పిల్లలు కాదురా బాబూ పిడుగులు. ఇంతింత లేరు వీళ్ల బట్టల రేట్లు చూస్తే కళ్లు తిరుగుతున్నాయి. వద్దంటే వినరు కదా, అడిగిందల్లా కొనిపెట్టకపోతే ఇంకేమైనా ఉందా? అనే వాళ్లు మనకు ఏ దుకాణానికి వెళ్లినా కనిపిస్తారు. అసోచెమ్ (వ్యాపార, పారిశ్రామిక సంస్థల అసోసియేషన్) విశ్లేషణ ప్రకారం ఏటా పిల్లల దుస్తుల మార్కెట్ 20శాతం చొప్పున పెరుగుతూ 2015 నాటికి ఇప్పుడున్న 38వేల నుంచి ఏడాదికి 80వేల కోట్ల రూపాయలకు పెరుగుతుందట. మీడియాలో బహుళప్రచారం, కొంతమంది తల్లిదండ్రుల ఆదాయాలు పెరగటం, పిల్లల నుంచి వస్తున్న వత్తిళ్ల కారణంగా ఏదో ఒక దుస్తులు కాకుండా బ్రాండెడ్ దుస్తుల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నయ్ వంటి మెట్రో నగరాలేగాక విజయవాడ, గుంటూరు వంటి పట్టణాలలో ఈ పెరుగుదల ఎక్కువగా ఉంది. బ్రాండెడ్ దుస్తుల విక్రయాలు ప్రస్తుతం ఏటా ఐదువేల కోట్ల రూపాయల మేరకు జరుగుతున్నాయి. వేగంగా పెరుగుతున్న మార్కెట్లలో ఇదొకటి. ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్నట్లుగా ధనవంతుల పిల్లల ఫ్యాషన్లు మధ్యతరగతి,పేదకుటుంబాలకు పెద్ద సమస్యలను తెచ్చి పెడుతోంది. అబ్బాయిల దుస్తుల కంటే ప్రపంచ వ్యాపితంగా అమ్మాయిల దుస్తులే ఎక్కువగా అమ్ముడు పోతున్నాయి. అందుకే విదేశీ బడా కంపెనీలు మన దేశంలోని చిన్న దుకాణాలను దెబ్బతీసే విధంగా తమ పెట్టుబడులతో మన దేశంలో తమ దుకాణాలను తెరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వత్తిడి తేవటంతో పాటు ప్రలోభాలకు గురి చేస్తున్నాయి.

**వ్రతం చెడ్డా ఫలం దక్కలే**

డచ్‌దేశాన్ని నెదర్లాండ్స్ అని కూడా అంటారు. ఒకప్పుడు ప్రపంచాన్ని ఆక్రమించుకొనేందుకు ప్రయత్నించి విఫలమైంది. ఊరందరికీ వెల్లుల్లి తినవద్దని చెప్పి ఇంట్లో భార్యపై ఉగ్రుడైన హరిదాసు మాదిరి అప్పులు చేస్తే తిప్పలు తప్పవంటూ ఐరోపాకు నీతులు చెప్పే నెదర్లాండ్స్ ఇప్పుడు తన జనాభా అప్పుల పాలు కావటాన్ని సమర్ధించుకోలేక నానా అగచాట్లు పడుతోంది. దివాళా తీసిన గ్రీస్, పోర్చుగల్, ఐర్లండ్, స్పెయిన్ దేశ కుటుంబాల కంటే నెదర్లాండ్స్ కుటుంబాల అప్పు ఎక్కువగా ఉందట. ఎన్నో సంవత్సరాల క్రితమే వ్యభిచారం, మాదకద్రవ్యాల వాడకాన్ని చట్టబద్ధం చేసిన నెదర్లాండ్స్ బైబిల్ నీతి సూత్రాలకు ఎప్పుడో పాతరేసిన కారణంగానే ఇప్పుడీ స్థితి దాపురించిందని కొందరు మత ఛాందసులు వాపోతున్నారు. వ్రతం చెడ్డా ఫలం దక్కక పోవటం అంటే ఇదేనా?

**- ఎం. కోటేశ్వరరావు**

# మీ ఇంట్లోనే పవర్‌ఫుల్ స్పోకెన్ ఇంగ్లీష్ టీచర్

## ఇంగ్లీష్ కోర్స్ రూ.600/- లకే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



### మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1
డివిజన్-2
డివిజన్-3
\+ అడిషనల్ బుక్స్, ఒక డైరీ, ఒక ఆడియో సి.డి. మరియు కోర్స్‌కు ఉపయోగపడే 4 ఇన్ 1 గిఫ్ట్ బుక్స్ (పాకెట్ సైజులో)

**ఇవన్నీ రూ.600/-లు**

**డివిజన్-1** Basic నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది.

**డివిజన్-2** తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది.

**డివిజన్-3** ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది.

**పూర్తి డబ్బు వాపస్** మనస్ఫూర్తిగా మీకీ కోర్సు నచ్చలేదని అనిపిస్తే, కోర్సు పుస్తకాలు 15 రోజుల్లోపల మాకు తిప్పి పంపండి. మీ డబ్బుని (కేవలం పోస్టు ఖర్చులు మాత్రం మినహాయించి) మీకు ఎమ్.ఓ.చేస్తాం. గిఫ్ట్ పుస్తకాల సైజు 9 cm X 11 cm లోనూ, కోర్స్ మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ ఉంటాయి. డైరీ సైజు 12 cm X 17.5 cm లోనూ (ఆఫ్‌సెట్ మల్టీకలర్ కవర్‌తో) ఉంటాయి. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతీ సంవత్సరానికి క్రొత్త డైరీగా ఉపయోగించుకునే విధంగా ప్రత్యేకంగా రూపొందించబడిన డైరీ.

**కూపన్ పంపండి లేదా SMS పంపండి.**

**Phone: 0-99405 70931**

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పేరు, ఇంటి నెం. ఊరిపేరు, పిన్‌కోడ్, ఫోన్ నెం.లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. పై ఫోన్ నెంబరు 24 గంటలూ కంప్యూటర్‌కు కనెక్ట్ చేయబడి ఉంటుంది. మీరు పంపే ఎస్.ఎమ్.ఎస్. అడ్రసు ఫోన్ నుండి కంప్యూటర్‌కు వెళ్తుంది. మీ అడ్రసు ప్రకారం మేము కోర్సు మెటీరియల్ పంపుతాము. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

## కొత్త సంవత్సర కానుక




**STUDENTS' ENGLISH INSTITUTE**

Post Bag No. 8569,
No. 17/A, Chari Street, T. Nagar, Chennai - 600 017.

Name: ..........................................................
Address: ..........................................................
..........................................................
..........................................................
..........................................................
.......................... Pincode

నాకు కోర్సు మెటీరియల్ పంపండి. పోస్ట్‌మేన్‌కి మొత్తం రూ.600/-లు చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

**కొన్ని లక్షలాదిమంది విద్యార్థులచేత పూర్తిగా అంగీకరించబడిన అద్భుతమయిన కోర్స్**

కథ

# ఆ చేతి చేత...

**- ముళ్లపూడి వెంకటరమణ**

**బా**మ్మ వంట చేస్తూ ఉండగానే, అక్కడ తారట్లాడి, ఆవిడ కన్ను మరగేసి, వత్తులపెట్లో డబ్బులు చెక్కెయ్యడంలో భీమశంకరంగారు చిన్నప్పుడు సిద్ధహస్తుడు. ఆ రోజుల్లో వెనకబడ్డ స్నేహితులకు ఈ విద్య కిటుకులు ఉపదేశించి గురువనిపించుకున్నాడు. బడి ఎగేసి, కాలవగట్ల వెంట బీడీలు కాలుస్తూ రోజుల తరబడి తిరిగినా, గోడ కట్టినట్టు అబద్ధాలు చెప్పి ఎవరికీ అందకుండా నిభాయించుకోగలిగిన సాటిలేని మేటి మొనగాడు. దరిమిలా పెద్దవాడయ్యాక, ఆఫీసుకు



చెప్పిన జబ్బు చెప్పకుండా సెలవుపెట్టి నెగ్గుకొచ్చిన ధీశాలి. అమెరికన్ పుస్తకాల సలహాలతో ఇంకా ఎన్నో పరిస్థితులకు తట్టుకోవడం, నిలిచి పరిష్కరించడం నేర్చుకున్నాడు. చిన్నప్పుడు కంఠతా వచ్చిన పదమూడో ఎక్కంలాగే ఇదీ క్రమేపీ రూపు మాసింది. ఆ రోజులు వెళ్లిపోయాయి.

అంతటి భీమశంకరంగారు ఏభయ్యోపడిలో పడ్డాక, ఒక ఆదివారంనాడు, ఎదుట గోళ్లు గిల్లుకుంటూ కూర్చున్న పాతికేళ్ల కుమారరత్నం వంక బాధగా చూస్తూ పడక కుర్చీలో పడుకుని సతమతమవుతున్నాడు.

"చలేస్తోందని చెప్పి చూడరా నాయనా" అన్నాడు చివరికి.

"శాలువా కప్పుకోమందండి. లేకపోతే సావిట్లోకొచ్చి పడుకోమంటోందండి" అన్నాడు కుమారుడు వినయంగా.

"ఆమోదించకపోయింది... అయినా కాకపోయినా ఏం మహిళలురా అబ్బాయి. ప్రాణాలు తోడేస్తున్నారనుకో. మొగుడు వెధవ ఆదివారం పూట కాస్త ఊళ్లోకెళ్లాలంటే వీళ్ల నిఘా ఏమిట్రా" అన్నాడు భీమశంకరం ప్రాణం విసుగెత్తిపోయి.

కొడుకు తల దించుకున్నాడు మాట్లాడకుండా.

"టైమెంతయిందిరా"

"మూడున్నరండి"

"అయ్య బాబోయ్ రైలుకింక గంటన్నర ఉందన్నమాట" అన్నాడు భీమశంకరంగారు.

ఆయన ఆ ఉదయం 9 గంటల నుండి మూడున్నర వరకూ పదిసార్లు టైమడిగి తొమ్మిదిసార్లు అయ్యబాబోయ్ అన్నాడు. ఒకసారి 'అబ్బా అప్పుడే రెండయిందిరా' అన్నాడు. క్రితం రాత్రి తొమ్మిది నుండి ఆ రోజు ఉదయం 7 గంటల వరకూ కొడుక్కి డబ్బివ్వమనీ, 7 నుండి 9 వరకూ తన పంచె, చొక్కా కండువా తన ముఖాన తగలెయ్యమనీ భార్యను పరిపరివిధాల బ్రతిమాలుతూ వచ్చాడు.

ఆరు మూడయ్యేది మూడు ఆరయ్యేది "ఆ యాభై" మాత్రం ఇచ్చేది లేదని ఆవిడ ఖరారుగా చెప్పేసింది. "కట్నం లేకుండా పిల్లని చేసుకున్నాం కదా! ఆ మాత్రం అల్లుడు గదా అని ఓ నూట పదహార్లు పండుగ పేరు చెప్పి వాళ్లివ్వరాదా, మన వెధవాయ పెళ్లాంచేత అడిగించరాదా" అని ఆవిడ రాత్రి గట్టిగా అనేసింది.

మెల్లిగా వెధవా అంటే గట్టిగా ముండా అనే తరహా మనిషి భీమశంకరంగారి భార్య.

పండక్కి అత్తారింటికి వెళ్లి మళ్లా పట్నం వెళ్తా, కొడుకూ కోడలూ ఇక్కడే దిగారు. ఓ నెల జీతం ముందే తీసుకుని ప్రయాణాలకు ఖర్చు పెట్టేసినందువల్ల, పట్నంలో కొంప చేరగానే ఆవగింజ దగ్గర్నుంచి తడుముకోవాలని బండి దిగిన గంటలో కొడుకు విన్నవించుకున్నాడు. ఉన్న డబ్బు రైలుకి కటాకటిగా సరిపోతుందని కూడా చెప్పుకున్నాడు. భీమశంకరం గారి గుండె కరిగిపోయింది. ఆయన భార్య ససేమిరా కాణీ ఇవ్వడానికి వల్ల కాదంది. ఆపాటి జాలి తనకీ ఉందని కూడా చెప్పింది. అవతల కొడుకో కోడలో విని ఏమనుకుంటారో అని భీమశంకరం గారి బెంగ.

"సరేలే. నువ్వు ఇవ్వొద్దు. పొద్దున నేనే చూసుకుంటా" అన్నాడు చాలా గంభీరంగా.

ఆదివారం ఉదయం ఆయన లేచి అప్పుకు వెళ్లబోయేసరికి చొక్కా, పంచె, కండువా కనపడలేదు. పెట్టె తాళం వేసుంది.

"ఏవే, నా చొక్కా ఏదీ!" అంటూ వంటింట్లోకి వెళ్లాడు.

"ముందు స్నానం చెయ్యండి" అందామె.

శంకరం గారు స్నానం చేసి కట్టుకున్న పంచె తడిపేశాడు. ఓ అంగవస్త్రం, తువ్వాలు అందించిందావిడ. అవి కట్టుకుని దేవుడికి దీపం వెలిగించి, ఓ పువ్వు ముక్క పడేసి లేచాడు. ఉట్టి వెనక చిలక కొయ్యకి తగిలించి ఉన్నాయి తన ఆఫీసు దుస్తులు. కాస్త ఆశ్చర్యపడుతూ తీసుకోబోయే సరికి "ఆగండి. ఆదివారం పూట ఎక్కడికెళ్తారు?" అందామె.

"పనుంది"

"నాకు తెలుసు ఆ రాచకార్యం. మీరేం వాడికి డబ్బు తెచ్చివ్వక్కర్లేదు. అంత అవసరమయితే ఇక్కడింకొక రోజు ఉండి, అత్తవారింటి నుంచి తీగె టపా మీద తెప్పించుకోమనండి"

"అది కాదే..."

"మీరు ముందు వీధరుగు మీదకెళ్లి కూర్చుని పేపరు చదువుకోండి. నాకు పనుంది. పాలకాయలు, జంతికలూ చెయ్యాలి"

శంకరంగారు నోరు మూసుకుని వీధరుగు మీదకెళ్లిపోయాడు.

కొడుకు అక్కడ కూర్చుని ఆలోచిస్తున్నాడు.

"బాబూ ఇవ్వాల్టికాగి, రేపు వెళ్లరాదురా. ఇవాళ ఆదివారం. రొఖం జత పడింది కాదు" అన్నాడు ఎంతో లాలనగా.

"లేదండీ నాన్నగారూ. రేపే జాయినయిపోవాలి"

శంకరంగారు దిగాలుగా కూలబడ్డాడు కుర్చీలో. తను ఒక్కడుగు అలా వెళ్తొస్తే ఎవడినెత్తో కొట్టి యాభై కాదు వందైనా పుట్టించవచ్చునని ఆశ వుంది. కానీ ఇంట్లో ఆడది మొండికెత్తిపోయి, తన చొక్కా పంచె వంటింట్లో పెట్టుకుని ఇవ్వను పొమ్మంటే ఎలా చావడం... తాలూకా ఆఫీసులో క్యాషియర్ గిరీ ఆమోదిస్తూ అంగోస్త్రం కట్టుకు ఊరేగడం అంటే ఒళ్లు చచ్చిపోయినట్లుంది. అబ్బాయికే చీటి రాసిచ్చి పంపుదామంటే మనసొప్పలేదు. వాడిప్పటికే ఎంతో మదనపడి, డబ్బు వద్దులెండి నాన్నగారూ అంటున్నాడు.

కన్న కొడుకుకి కానీ డబ్బివ్వలేని వాడినా అనుకుని ఒక్కసారిగా తెగించి, వంటింట్లోకెళ్లి "నాకు పనుంది. ఆ గుడ్డలిలా పారెయ్" అన్నాడు గంభీరంగా. అవిడ వల్లకాదు పొమ్మంది అంతకన్నా గంభీరంగా. ఆ తరువాత శంకరంగారికి చిన్నప్పటి విద్యలు జ్ఞాపకం వచ్చాయి. అక్కడే కాసేపు తారట్లాడి చూశాడు. లాభం లేకపోయింది. ఆవిడ వెయ్యి కళ్లు పెట్టుకుని చూస్తూ ఉందాయె.

తన చిన్ననాటి కళా వైదగ్ధ్యం ఈనాడు ఎందుకూ కొరగాకుండా పోయిందని విచారించాడు శంకరంగారు. ఏడెనిమిదేళ్ల కొడుకున్నా, కాస్త తరిఫీదు ఇచ్చి, ఇలాంటి సమస్యలను చులాగ్గా ఎదుర్కోవచ్చు. ఉన్నవాడు పాతికేళ్లవాడాయె. వాడికి ఇప్పుడు టోకరా విద్య ఎలా నేర్పడం?

కాసేపు ఆలోచించి కొత్తరకం ఎత్తువేశాడు ఆయన. వీధరుగు మీద కూర్చుని కోడలు పిల్లని పిల్చాడు. "అమ్మాయ్! వంటింట చిలక్కొయ్యని నా చొక్కా పంచా ఉన్నాయి గాని, కాస్త పట్రా అమ్మా" అన్నాడు.

కోడలు మళ్లా రాలేదు. ఆవిడే వచ్చింది. "మీక్కాదు చెప్పింది. ఏమిటా కుర్రచేష్టలు?" అని కేకలేసి వెళ్లిపోయింది. కోడలు విస్తుపోయింది.

భోజనాలయ్యాయి. పదకొండయింది. పన్నెండయింది. ఒంటిగంట కూడా అయినా, ఆవిడగారు కునుకు తీసేటట్లు కనబడలేదు. మళ్లీ నిప్పంటించి, పిండివంటలు ప్రారంభించింది కొడుకూ కోడలూ సాయంత్రం వెళ్లిపోతున్నారు గదా అని.

శంకరంగారికి నిద్ర రాలేదు. కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. కొడుకు నిద్రపోతున్నాడు.

ఆయనకో ఊహ తోచింది. వాడి చొక్కా వేసుకుంటే... పంచె లేదాయె పొడుగు పంట్లాంలే ఉన్నాయి. శంకరంగారికి సిగ్గేసింది. అయినా సరే అని ఓ పంట్లాం కొనుక్కున్నాడు. చొక్కాలన్నీ చిత్రంగా ఉన్నాయి. పట్నం చొక్కాలు కాబోలు ఒకటీ బొడ్డు దిగదు. రవికెల్లా ఉన్నాయి. అద్దంలో చూసుకున్నాడు. నవ్వొచ్చింది. తను నవ్వేలోగానే ఇంకో రెండు గొంతులు, ఒకటి కిలకిల, ఇంకొకటి ఫెళఫెళ నవ్వాయి. ఆ నవ్వుకి లేచిన కొడుకు కూడా పకపక నవ్వాడు.

శంకరం గారికి ఒళ్లు చచ్చిపోయినట్లయింది. దొంగతనం చేస్తూ పట్టుబడ్డట్టనిపించింది. బీరువా కింద చూశాడు. అందులో ముడుచుకు కూర్చుందామని... ఒక్క క్షణం ఆగి ముగ్గురివంకా చూశాడు. ఒక్క పెట్టున తనూ నవ్వెయ్యడం ప్రారంభించాడు.

నవ్వులయిపోయాక, తన పంచె, చొక్కా ఇయ్యమని అడిగాడు భార్యని. మీకేం మతిపోయిందా అందామె.

మళ్లా అంగవస్త్రం తువ్వాలు కట్టుకుని, అరుగు మీద కుర్చీలో చేరాడు శంకరంగారు. సృష్ట్యాది నుండి ఏ పురుషుడూ దేనికీ పడనంతగా విరహతాపం పడుతూ. మూడున్నర అయింది. రైలుకింక గంటన్నర టైముంది. ఎలా డబ్బు పుట్టించడం. వీధి వెంట ఓ కుర్రాడు వస్తున్నాడు అట్టపెట్టెని తన్నుకుంటూ. వాడు తెలుసు శంకరంగారికి. పెద్ద ఊహ పోయింది. కుర్రాణ్ణి పిలిచాడు. తెగించాడు. "ఒరేయ్ బాబు! నువ్వు సుబ్బారావు గారింటికెళ్లి అర్జంటుగా... ఆహకాదు, మా ఆఫీసు జవాను నాగన్నింటికెళ్లి ఇక్కడున్నట్లుగా చిటికెలో కేకేసుకురా, నీకు రేపు గాలిపడగ కొనిస్తా" అన్నాడు.

ఏ కళనున్నాడో వాడు సరేనని వెళ్లాడు. మూడున్నర నుండి నాలుగు దాకా శంకరంగారు గుండెకాయ నిమిషానికి మూడు వందలసార్లు కొట్టుకుంది.

నాలుగింటికి నాగన్న వచ్చి ఏం బాబూ అనగానే స్థిమితపడింది.

"ఏవోయ్ నాగన్నా! నీకు పుణ్యం వస్తుంది. రేపు రూపాయిస్తుంది. కాని, వెంటనే సుబ్బారావు గారింటికెళ్లి అర్జంటుగా అమాంతంగా ఒక్క యాభై రూపాయలు అడిగి తెచ్చిపెట్టు. రేపు ఆఫీసుకు రాగానే ఇస్తానని చెప్పు" అన్నాడు.

"వెళ్తను కానీ పంచె చొక్కా..."

"దానికేంలే. నే చెప్పానని చెబుదూ ఇస్తాడు"

"పోనీ సీటీ ముక్క రాసియ్యండి బాబు"

"చీటీ, చీటీ కదూ, మరే చీటీ... అవును చీటీ...



కాని కాని వీల్లేదే మా ఇంట్లో... నాకర్జెంటు పనుంది. నువ్వెళ్లి చెప్పు, కావాలంటే ఆయన్నే పత్రమ్మను" అన్నాడు శంకరంగారు కంగారుగా. లోపలికి తొంగి చూశాడు. భార్య దగ్గర్లో లేదు.

పుణ్యం ఉంటుందనీ, జన్మకో మేలు మర్చిపోడనీ, డబ్బు మర్నాడే ఫిరాయించేస్తాడనీ, సంగతి తాపీగా చెప్తాడనీ, పదే పదే మరీ మరీ సుబ్బారావుకి చెప్పి ఎలాగేనా రొఖం జతపరిచి పత్రావలసిందని నాగన్నకి చెప్పి పంపాడు.

నాగన్న వెళ్లిన క్షణం నుండి నాలుగూ నలభై ఐదు వరకూ ఆయన గుండె నిమిషానికి నాలుగు వందల సార్లు చొప్పున కొట్టుకుంది.

ఇంట్లో పిండి వంటలు పూర్తి అయిపోయాయి. మూట కట్టేసి, కొడుకూ కోడలూ ప్రయాణానికి సిద్ధమైపోయారు. భార్య పట్టుచీర కట్టేసుకుంది. కొడుకు బండి తీసుకురావడానికెళ్లాడు. ఇంకో పది నిమిషాలలో అంతా రైలుకి బయల్దేరుతారు.

నాగన్న సుబ్బారావు ఇంటికి వెళ్తాడా! వెళ్తే ఆయన ఉంటాడా! ఉంటే డబ్బిస్తాడా! ఇచ్చినా, అది తనకి వేళకి అందుతుందా! అందినా భార్య కంట పడకుండా ఉంటుందా! కొడుకుకి కష్టం ఆదుకుని శంకరంగారు ఆదర్శపితగా నిరూపించుకుంటాడా! గుమ్మంలోకి బండి వచ్చేసింది. సామాను పెట్టేస్తున్నారు. టైము చూసుకుని శంకరంగారు కదల్లేదు. తను లోపలికి వెళ్తే ఈ లోగా కొంప మునుగుతుందని భయం. భార్య గదమాయిస్తోంది.

"మెడ బెణికింది. అర్జెంటుగా కాసిని నీళ్లు కాచు. కాపడం పెట్టాలి" అన్నాడాయన హఠాత్తుగా బాధపడుతూ.

ఆవిడకి జాలేసింది. "పొద్దుట్నుంచి ఒక్కరూ ఆ పడక కుర్చీలోనే కూర్చున్నారాయె, బెణకదూ మరి" అంటూ లోపలికి వెళ్లి కుంపటి రాజేసింది.

ఈలోగా నాగన్న సుబ్బారావింటికి వెళ్లాడు. సందేశం అందజేశాడు. క్యాషియర్ గారికి అప్పిచ్చినా పువ్వుల్లో పెట్టి మళ్లీ ఇవ్వగలరన్న ధీమాలో సుబ్బారావు గారు ఏభై రూపాయలూ నాగన్నకిచ్చి పంపాడు. నాగన్న వాయువేగ మనోవేగాలతో వచ్చి, శంకరంగారికి రొఖం అందించాడు. "నాకిస్తానన్న రూపాయేది బాబు" అన్నాడు.

"రేపు రేపు రేపు. లేదు లేదు చిల్లర లేదు. రేపు రెండు, రేపు రెండిస్తా. పద పద పద" అంటూ శంకరంగారు అదరాబదరా ఆ డబ్బా పంచె, చొక్కా పట్టుకుని పడమటింట్లోకెళ్లిపోయి తలుపేసుకున్నాడు.

★★★

రైలొచ్చింది. నలుగురూ ఎక్కి కూర్చున్నారు. అక్కడ కూడా శంకరంగారికి స్వేచ్ఛలేకపోయింది. భార్య ఒక పక్క కోడలికి నీతులు నూరిపోస్తూనే తనని ఓ కంట కనిపెడుతోంది.

"అత్తయ్యా! మా అమ్మలేని కొరత తీర్చారు మీరు ఈ ఒక్క రోజులోనూ. మా పిన్ని ఇంత ఆప్యాయంగా నన్నెన్నడూ చూడలేదత్తయ్యా. మీరు మా వూరు రావాలి. నెల్లాళ్లపాటు ఉండాలి" అంది కోడలు హఠాత్తుగా.

శంకరంగారి భార్య ఉక్కిరి బిక్కిరై పోయింది. కోడలి శిర్సాన్ని ఆఘ్రాణించింది. మెటికలు విరుచుకు "నా తల్లే" అంది ఉప్పొంగే ప్రేమతో. ఒక్క క్షణం ఆగి "ఏవండీ! కోడలికి పువ్వులు కొనిద్దామనేనా లేదు గదా. వేళైనట్లుంది. చట్టుక్కున వెళ్లి కాస్త దవనం మరువం నాలుగు చేమంతి పువ్వులూ పట్రండి" అంటూ ఓ పావలా తీసి ఇచ్చింది.

శంకరంగారు ఎగిరి గంతేశాడు.

"నువ్వు కూడా వెళ్లరా. ఆయన బేరం చేస్తే వాడిన పువ్వులే వచ్చేది" అందావిడ.

"దారా నాన్నా" అన్నాడు శంకరం విడుదల అయిన ఖైదీలా.

పువ్వులు కొన్నాక, అంగీ జేబులో నుంచి ఏభై రూపాయలూ తీసి కొడుకు జేబులో పెట్టాడు. "భద్రం నాయనా, కోడలికి చెప్పకు. అవసరానికుంచుకో. ఇంతకన్నా ఏం చేయలేకపోయాను. తాపీగా పంపుతానులే"

అనేసి కొడుకు జవాబు వినకుండానే రెక్క పట్టుకుని రైలు పెట్టె దగ్గరికి ఈడ్చుకొచ్చేశాడు.

రైలు కదిలింది. రతీమన్మధులు చెన్నపట్నానికి, పార్వతీ పరమేశ్వరులు స్వగృహానికి బయల్దేరారు.

ఒంటెద్దు బండిలో జేరగిలబడి కూర్చుని "అబ్బాయి మొహం అణా ఇడ్డెనంతయింది. బయల్దేరినప్పుడు వెనక నుంచి డబ్బు పంపుతానన్నారు కాబోలు. అవేం వల్ల కాదు" అందావిడ హేళనగా.

శంకరంగారు ధీమాగా నవ్వాడు. "కోడలు పిల్ల మొహం కళకళలాడుతూ కనపడింది. ఏమిటి సంగతి? తెగించి ఓ పావలా చేతిలో పెట్టి గుప్పిట మూసి, జంతికలు కొనుక్కోమన్నావా" అన్నాడు.

"పిల్లలు అవస్థ పడతారని నాకూ తెలుసు. అక్కడికి మీకే ప్రేమ ఉన్నట్లు నిన్నా ఇవాళా నా ప్రాణం తీశారు కాని, పావలా ఏం కర్మం, నిన్న మీరడిగిన యాభై రూపాయలూ, మిమ్మల్ని పువ్వులకి పంపినప్పుడు పిల్ల చేతిలో పెట్టి గుట్టుగా దాచుకోమని చెప్పాను. అబ్బాయికి ఈ సంగతి రాయబోకండి. రేపే తగలేస్తాడు" అందావిడ విలాసంగా.

"అబ్బే. నేను రాసినా వాడలా అడగడులే" అన్నాడు శంకరంగారు గుంభనంగా.

★

ప్రత్యేకం

# జీవిత నాటకం - కన్యాశుల్కం



**మన దేశ భాషలన్నింటిలోనూ, పూర్తిగా వచనంలో, అందులోకి వ్యవహారిక శైలిలో, మొట్టమొదటిసారిగా నాటకం రాసింది గురజాడ అప్పారావుగారనే అనుకుంటాను. సాంఘిక వాస్తవికత దర్పణంలో వలె యథాతథంగా ప్రతిబింబించిన కళాఖండం మన భాషలోనే కాదు, ఇతర భారతీయ భాషల్లోనైనా మొదటిదీ ఆఖరిదీ 'కన్యాశుల్కమే' అనుకుంటాను. కన్యాశుల్కం నాటకాన్ని ఆ తెగలో మించడం మాట అటుంచి, ఆ దరిదాపులకైనా రాగల నాటకం మన దేశంలో ఏదైనా ఉంటే దాని సంగతి ఇంతవరకూ ఎవరికీ తెలియకపోవడం ఆశ్చర్యకరమే అని నేననుకుంటాను.**

**- శ్రీశ్రీ**

అంతకంటే ఆశ్చర్యకరమైన విషయం : శ్రీశ్రీ అకడమిక్ సంయమనం అధికంగా పాటించి "కన్యాశుల్కం' లాంటి నాటకం మన దేశంలో మరెక్కడా లేదు" అని ఖచ్చితంగా చెప్పకపోవడం. కన్యాశుల్కంలో వ్యక్తమయ్యే నిర్దుష్టమైన వాస్తవికతా ధోరణిని అవలంబించిన రచన యూరోపియన్ నాటకరంగంలో కూడా కనీసం ఆనాటికి లేదని శ్రీశ్రీ రాయకపోవడమూ ఆశ్చర్యకరమే. శ్రీశ్రీకి ఆంధ్ర భక్తి మెండని అందరికీ తెలుసు. కాని పై వాక్యాలను ఎంత జాగ్రత్తగా - అతి జాగ్రత్తగా రాశాడో గమనిస్తే 1980 దశకంలో మాత్రమే కన్యాశుల్కం ప్రాముఖ్యత గురించి వేరే కోణం ఆవిష్కారం కావడం మాత్రం ఆశ్చర్యకరం కాదు. 1980కి ముందు కన్యాశుల్కం నాటకంలోని వాస్తవికతనూ, కళా సౌష్టవాన్ని, పాత్రల స్వభావాలనూ రకరకాలుగా వివరించి వ్యాఖ్యానించిన పెద్దలనేకులున్నారు. 'కన్యాశుల్కం' నాటకమే కాదనేవారి సంగతి రామప్పంతులు చెప్పినట్లు వేరే కథ. 1980 తర్వాత వాస్తవ జీవితంలోని నాటకీయత 'కాన్యాశుల్కం'లో గమనించడం ప్రారంభమైంది. 'కన్యాశుల్కం' ఒక కల్పన కాదనీ, వాస్తవ జీవిత శకలాల పేర్పు అనీ, ఆ జీవిత శకలాల నేపథ్యంలో కథకో, నాటక రూపానికో పరిమితమైన వ్యవహారం కాదనీ... ఒక నూతన దృష్టి 1980 దశకంలో మాత్రమే వ్యక్తమైంది. నాటకంలో జీవితాన్ని అన్వేషించడం కంటే, జీవితంలోని నాటకీయతను గుర్తించడం మరింత ప్రయోజనకరమని నిర్ణయానికి రావడం ఇక్కడి ప్రధానాంశం. జీవితం - కళారూపం - జీవితం... ఇదొక పెద్ద గొలుసు.

ఫలితంగా, కన్యాశుల్కం కథా వస్తువు, ఇతివృత్తం, నిర్మాణ వ్యూహం మొదలైన వివరాలకు పోకుండానే కొన్ని నిర్ణయాలకు రావచ్చును. 'కన్యాశుల్కం'లోని సంభాషణలన్నింటినీ 'గ్రంథస్తం చేసిన సంభాషణలు'గా పేర్కొనవచ్చు. ఎటూ వచ్చి గ్రంథస్థం చేయడంలో రచయిత తీసుకున్న జాగ్రత్త, చూపిన సంయమనం, ఆచరించిన నిజాయితీ... అన్నీ కలిసి కన్యాశుల్కాన్ని ఒక చారిత్రక పత్రంగా రూపొందించాయి. అంటే 'గ్రంథస్థం చేయడం' గొప్ప శ్రమతో కూడుకున్న వ్యవహారమన్న మాట. 1909కి ముందు రాసిన 'కొండు భట్టీయం'లోని కొన్ని సంభాషణలు, కొన్ని వివరాలు... 'కన్యాశుల్కం'లో చేరుకున్నాయని గమనిస్తే గురజాడ 'కన్యాశుల్కం' రచనను పరిపుష్టం చేయడానికి చేసిన 'వ్యాయామం' కూడా మనకు స్ఫురిస్తుంది. కథకూ, కథనానికీ అవసరమైన దృశ్యాలనూ, సంభాషణలను మాత్రమే 'పరిమితంగా' తీసుకుని ఉంటే 'కన్యాశుల్కం' ఒక నాటకంగా మాత్రమే మనకు గుర్తుండేది. అందుకు భిన్నంగా, ఒక నిర్దిష్ట ప్రాంతంలో, ఒక నిర్దిష్ట కాలంలో ఉన్న సామాజిక భావాల రాశి 'కన్యాశుల్కం'లో మనకు పుష్కలంగా లభిస్తోంది. కనుకనే దాన్ని మనం జీవితంలో భాగంగా చూడాల్సి వస్తోంది. ఆంధ్ర దేశపు సాంఘిక చరిత్ర రాయడానికి - ముఖ్యంగా కళింగాంధ్ర చరిత్ర - కన్యాశుల్కం ఒక ఆధారంగా పనికొస్తుంది. ఈ సందర్భంలో గురజాడ 'కళింగాంధ్రదేశ చరిత్ర' రాశాడని గుర్తు పెట్టుకోవడం మరింత అవసరం. నడుస్తున్న చరిత్రను 'కన్యాశుల్కం' అక్షరబద్ధం చేసింది.

నిత్యనైమిత్తికాలు, బ్రిటీషు వలస విధానం, దాని వారసత్వం, సాంఘిక దురాచారాలు - సదాచారాలు - కూడా - సంస్కరణ, దేశ స్వాతంత్ర్యం, హ్రస్వదృష్టీ, దీర్ఘదృష్టీ, నిజాయితీ, ఆత్మవంచన, నైర్మల్యం, కౌటిల్యం, సారళ్యం, సంక్లిష్టత, అధర్మం, అవినీతి... ఇలా జీవితంలో తటస్థపడే ప్రతి అంశమూ కన్యాశుల్కంలో ప్రస్తావనకు వచ్చింది. అన్నింటికంటే ముఖ్యంగా ఆధునికతా స్వభావం గురించీ, సంప్రదాయ బద్ధతను గురించీ... అప్పుడు వ్యాప్తిలో ఉన్న భావాల ప్రకటన 'కన్యాశుల్కం'లో అనాచ్ఛాదితంగా కనబడుతుంది.

'కన్యాశుల్కం' పాత్రలు అచ్చుటి సంకీర్ణ సమాజంలోని వ్యక్తులుగానే మనకు కనబడతాయి గాని, నాటకానికి "అవసరమైన" పాత్రల్లాగా కనబడవు. ఆయా పాత్రల ప్రవర్తన, ఆ పాత్రల

అవసరాలనూ, ఆశలనూ, లక్ష్యాలనూ అంటిపెట్టుకుని ఉండడం కూడా అందువల్లనే విశిష్టంగా కాక, సహజంగా కనబడుతుంది. అలాగే, కన్యాశుల్కంలో కొన్ని పాత్రలు గురజాడ ఊహలను కూడా దాటిపోయి స్వకీయ వ్యక్తిత్వాన్ని రూపొందించుకుని గురజాడను 'ధిక్కరించాయ'ని కొందరు విమర్శకుల నింద. నిజానికి ఇది ప్రశంస. గురజాడ పరిశీలనకూ, నిజాయితీకి ఈ వ్యాఖ్య ఒక అద్భుతమైన కితాబు.

అయితే గురజాడ జీవిత సంకీర్ణత వర్ణించడానికి ఎన్నుకున్న పాత్రలు, స్వభావాలు... స్థూలంగా ఒక ప్రణాళికను అనుసరించినట్లు కనబడుతుంది. నాటకంలోని పాత్రలను ఒక్కొక్కటిగా కాక, జంటలుగా రూపొందించాడు గురజాడ. (జంటలు అంటే స్వాభావికంగా అభిముఖమైన జంటలు). ఈ విధానం సమాజంలోని వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి అనుకూలంగా ఉండడమే కాక నాటకీయతా పోషణకు కూడా సౌష్ఠవాన్ని కూరుస్తుంది.

'కన్యాశుల్కం' నాటకంలో వర్ణితమైన సమాజానికి కొంచెం ఎడంగా ఉన్న పాత్ర గిరీశం పాత్ర. ఆ సమాజానికి అతడు కొత్తవాడు. పరాయివాడు. ఒక పాత్రకూ అతడున్న సామాజిక వాతావరణానికీ మధ్య దూరమున్నప్పుడు విచిత్ర సంఘటనలు, సన్నివేశాలు సహజమే. హనుమంతుని లంకాయాత్ర, ఊహా ప్రపంచంలో ఉండే డాన్‌క్విక్‌సెట్ చుట్టూ ఉన్న వాస్తవ ప్రపంచం, అభం శుభం తెలియని పార్వతీశం ఇంగ్లండు ప్రయాణం... ఇలా ప్రతిచోటా ఇదే పరిస్థితిని చూడవచ్చు. అయితే ఇక్కడ గిరీశం ఇంచుమించుగా మిగిలిన అన్ని పాత్రలకూ అభిముఖమైన పాత్రను పోషించాడు. గిరీశాన్ని మినహాయిస్తే... మిగతా పాత్రలను అభిముఖమైన జంటలుగా విడదీసి పరిశీలించవచ్చు. అనేక సమాన లక్షణాలుండి ఒకటి రెండు అంశాల్లో పూర్తి భిన్నమైన లక్షణాలను కలిగిన రెండు పాత్రలను అభిముఖమైన పాత్రలుగా నిర్వచించుకోవచ్చు. అభిముఖ స్వభావాలను వర్ణించడంలో అనేకత్వాన్ని ఆవిష్కరించడమే గురజాడ లక్ష్యం.

అగ్నిహోత్రావధాన్లు, లుబ్ధావధాన్లు... జంటనే తీసుకుందాం. ఇద్దరిదీ ఇంచుమించు ఒకే రకమైన వారసత్వమే. అయితే అగ్నిహోత్రావధాన్లు మరికొంచెం ఎక్కువగానే సంప్రదాయ విద్యాగంధం కలవాడు. మరోవైపున తన వ్యవహారాలు తానే చూసుకునేవాడు. సంప్రదాయాల్లోనూ, సాంస్కృతిక వారసత్వంలోనూ తరతమ భేదాలతో ఒక సమూహానికి చెందినవారే. అయితే లుబ్ధావధాన్లుకు అనుభవం వల్ల చివరికి పశ్చాత్తాపం లాంటి ఆలోచనలు వస్తాయి. అగ్నిహోత్రావధాన్లు 'సర్వజ్ఞుడు', "సందేహాలు లేనివాడు...". అందువల్ల అతనిలో మార్పు అసంభవం. ఇలా నాటకంలో మిగతా పాత్రలను జంటలుగా గమనించవచ్చు.

మహేశం – వెంకటేశం, పూటకూళ్లమ్మ – మీనాక్షి, కొండిభొట్లు – కాంబొట్లు, గిరీశం – బైరాగి, గిరీశం – రామప్పంతులు, రామప్పంతులు – కరటక శాస్త్రి... ఇలా జంటలను పెంచుకుంటూ పోవచ్చు. పాత్రల గతితార్కిక వైవిధ్యమే 'కన్యాశుల్కం' ప్రత్యేకత అని సరిపెట్టుకోనక్కర్లేదు. అలాగే సమాజంలోని పొరలన్నింటినీ పరిశీలించడానికీ, ఆవిష్కరించడానికీ చేసిన ప్రయత్నం వల్లనే 'కన్యాశుల్కం'లో సంకీర్ణత ఒకోసారి మరీ సరళంగా కూడా కనబడుతుంది. అంటే సంకీర్ణత, సారళ్యం జంటగా 'కన్యాశుల్కం' నాటకమంతటా ఆవరించి ఉండడం గమనించవచ్చు.

అసిరిగాడి పాత్రనే తీసుకుంటే, అతడు సర్వ సాధారణమైన వ్యక్తిగా కనబడతాడు. అన్నట్లు అగ్నిహోత్రావధాన్లు నౌకరు పేరు కూడా అసిరిగాడు కావడం యాదృచ్ఛికం కాదు. ఈ సాధారణతను వ్యక్తం చేయడానికే ఆ పేరు. మన జీవితంలో కూడా ఇది సాధారణమే. ఎందుచేతనో ఎక్కువమంది పని చేసుకునే పిల్లలకు లక్ష్మి అనే పేరు ఉండడం మనం గమనించవచ్చు. అసిరిగాడు అనే పేరు ఎంత సాధారణమైనదో, అతని వ్యక్తిత్వం అంత సంకీర్ణమైంది కూడా. అతనికి దయ్యాలమీద నమ్మకం లేదు. కానీ 'రెండు దయ్యాల బరువు' ఉందో లేదో చూడమని సీసా చేతికిచ్చినప్పుడు "ఓలమ్మ! ఎంత బలువుందోస్సి" అంటాడు! "దయ్యాలకు పెట్టింది తింటున్నారా!" అని రామప్పంతులును భయపెడతాడు ( మీనాక్షి ఇచ్చిన పలహారం

తింటున్నప్పుడు). అలాగే 'అదృశ్యంగా బైరాగి తన వెంట వస్తున్నాడ'ని గవరయ్య చెప్పినప్పుడు కూడా, 'నా కళ్లకు కనపడుతున్నాడే' అని సమాధానం చెప్పిన అసిరిగాడు "కల్లాకపటం లేనివాడ"ని – అందుకే అతడు బైరాగిని చూడగలుగుతున్నాడని భావం. గవరయ్య కితాబు సంపాదిస్తాడు. అన్నింటినీ మించి అతడు రామప్పంతులుకూ మీనాక్షికీ ఉన్న లైంగిక సంబంధాన్ని తైపారు వేసిన విధానం ఆశ్చర్యకరం! అతడికి రామప్పంతులు పట్ల ఇసుమంత గౌరవం కూడా లేదు. లుబ్ధావధాన్లు రామప్పంతులును కర్రతో కొట్టినప్పుడు "చచ్చాన్రా! కాలెవిక విరిగిపోయిందా"ని మొరపెట్టినప్పుడు "కానేల ఇంట్లో జొరబడితే బుగత కొట్టడా?" అని నిర్దాక్షిణ్యంగా వ్యాఖ్యానిస్తాడు. అదే అసిరిగాడు మీనాక్షిని పిలవమని రామప్పంతులు చెప్పినప్పుడు, అతని దగ్గర డబ్బులు గుంజుతాడు. అయితే మీనాక్షి పట్ల అతనికి ఇంచుకంత కూడా ఏహ్యభావం ఉన్నట్లు దాఖలా లేదు. అతని నైతిక చట్రంలో లైంగిక సంబంధం మీనాక్షికి సహజమైన అవసరం. రామప్పంతులు వస్తుతహ దుర్మార్గుడు. అందువల్ల అతనికి శిక్ష పడడం అవసరం. లుబ్ధావధాన్లు సమాజ నీతులకు అసిరిగాడు భిన్నమైనవాడు. సహజంగా ఉత్తముడు. అందువల్ల 'కన్యాశుల్కం' పాత్రలో నైతిక నియమావళి ప్రకారం పరిశీలించినప్పుడు అసిరిగాడు మధురవాణితో సరిపోగలడు. అసిరిగానిలో సాధారణత, సంక్లిష్టత పెనవేసుకుని ఉండడం వల్ల అతని పాత్ర ఒక సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకుంది.

ఈ రకంగా విశ్లేషించుకుంటూ పోతే, కొండిభొట్లు, పూటకూళ్లమ్మ, మునిసిబు నాయకులు. వీరేశ, మనవాళ్లయ్య, సారా దుకాణదారు రామందాసు... ఇలా అన్ని పాత్రలలోనూ సాధారణత, సంక్లిష్టత కలిసి ఉండడం గమనించవచ్చు.

ఇదే విధంగా, 'కన్యాశుల్కం'లోని అంకాలూ, రంగాలూ... ఇటు సాధారణతనూ, సంక్లిష్టతనూ సంతరించుకున్నట్లుగా గుర్తించడానికి పెద్ద శ్రమ పడనక్కర్లేదు (అది మరోసారి చూద్దాం). అయితే పాత్రల అభిముఖతా, పాత్రలలోని ద్వంద్వ లక్షణాలూ, దృశ్యాలలోని 'వైరుధ్య సంపుటి' మొత్తం జీవితం నుంచి వచ్చినవే. జీవితం కూడా ఒకేసారి సరళంగానూ, సంక్లిష్టంగానూ ఉండడం గమనించవచ్చు. అందువల్ల 'కన్యాశుల్కం' సంకీర్ణత జీవితపు సంకీర్ణతే.

**- హరిపురుషోత్తమరావు**

**(సృజన 200వ సంచిక, 1992)**




'నీలాల కన్నుల్లో సంద్రమే.. హైలెస్సో..! నింగి నీలమంతా సంద్రమే.. హైలెస్సో..! సంద్రాన మీనాల సందమే.. హైలెస్సో..! నేల కరిగిపోతే సందప్రే.. హైలెస్సో..! నీటిబొట్టు పెరిగిపోతే సంద్రమే.. హైలెస్సో..!' అన్నాడు ఓ సినీకవి.. నిజంగానే.. నింగి నీలాన్నంతా అద్దుకుని నీలంగా కనిపిస్తుంది సముద్రమే కదా..! సముద్రతీరాలు మనస్సును హాయిగొల్పిస్తాయి.. ఆ నీలి సముద్రం పైనుండి వీచే చల్లగాలులూ..కవ్వించే కెరటాలూ, బారులు తీరే పక్షులూ.. ఆ ఆహ్లాదభరిత వాతావరణంలో మైమరిచిన పిల్లాపెద్దల కేరింతలూ.. బెస్తవారి హైలెస్సలతో కడు రమణీయంగా ఉంటాయి సముద్రతీరాలు. అలాంటివాటిల్లో విశాఖతీరం ఒకటి. విశాఖ తీరం విహారశోభితంగా ఉంటుంది. ఎప్పుడూ అందంగా, ఆహ్లాదంగా కనిపిస్తూ పర్యాటకుల్ని రా.. రమ్మంటుంది.. తీరం పొడవునా కొబ్బరిచెట్లు.. వాటి నుండి వచ్చే స్వచ్ఛమైన గాలులు సందర్శకులను మైమరిపిస్తాయి. నిత్యం పర్యాటకులతో తీరం వెంబడి సందడే.. సందడి. ఉదయాన్నే సముద్రంలో నుండి సూర్యుడు బయటకు వస్తున్న దృశ్యం అత్యద్భుతం. ఆ శుభోదయ వేళ వ్యాహ్యాళికి వచ్చే వాళ్లు, ఆడుకునేవాళ్లతో సందడి ప్రారంభమవుతుంది.. సాయంవేళల్లో కవులు, రచయితలు, సందర్శకులతో కోలాహలంగా ఉంటుంది. రాత్రివేళ దీపపు కాంతులు ప్రతిబింబించడంతో సముద్రం కొత్త శోభను సంతరించుకుంటుంది. విశాఖతీరంలో చూడదగ్గవి భీమిలి, రిషికొండ, రామకృష్ణ బీచ్‌లు. మరి ఒక్కసారి వాటిని చూసొద్దామా..!

# విశాఖతీరం... విహార శోభితం...

ఎప్పటి నుండో విశాఖపట్టణం వెళ్లాలని కోరిక. విశాఖలో స్నేహితుల్ని, బంధువుల్ని సంప్రదిస్తే వాళ్లు అక్టోబర్– నవంబర్ మాసాల్లో అయితే ప్రకృతి చాలా బాగుంటుందన్నారు. దసరా సెలవుల్లో బయల్దేరాం. విశాఖపట్టణం అనగానే గుర్తుకొచ్చేది సముద్రం. ఇది అందరికీ అందుబాటులో ఉండదు కదా! ఆ అందాల్ని నిత్యం ఆస్వాదించడం ఆ తీర ప్రాంతాల వారికే సొంతం. బీచ్ అనగానే పట్టణంలో ఉండే రామకృష్ణ బీచ్ గురించే చెప్తారు. అయితే మా ఆడపడుచు వాళ్ల అమ్మాయీ అల్లుడూ అక్కడే ఉంటున్నారు. ఆయన ముందు భీమిలి వెళ్లి అక్కడ నుండి సిటీలోకి వద్దామన్నాడు. అలాగే వెళ్దామనుకుని, ఒక వ్యాను మాట్లాడుకున్నాం. అందరం కలిసి ఉదయమే బయల్దేరాం. ముందు భీమిలి వెళ్లాం.

భీమిలి విశాఖపట్టణానికి 25 కి.మీ. దూరంలో ఉంది. భీమిలి పశ్చిమం వైపు ఎత్తుగా ఉండి క్రమంగా తూర్పువైపు సముద్రతీరానికి వచ్చేటప్పటికి పల్లంగా ఉంటుంది. దీంతో భీమిలిని పశ్చిమం నుండి తూర్పుకు సముద్రతీరంవైపు చూస్తే ఆ దృశ్యం ఎంతో రమణీయంగా ఉంటుంది. ఈ పట్టణంలోని లాటరైటు శిలలపై ప్రాచీనమైన నరసింహస్వామి దేవాలయం ఉంది. ఇంకో విశేషమేమంటే ఇక్కడ ఇప్పటికీ డచ్ వారి వలస స్థావర అవశేషాలుండడం. బీచ్ లోతు ఉండదు కాబట్టి ఈత కొట్టడానికి వీలుగా ఉంటుంది. ఇకపోతే ఇక్కడ చెప్పుకోదగ్గది భీమిలి కోట. '16–18 శతాబ్దాల మధ్య మన దేశం వర్తకానికి వచ్చినప్పుడు భీమిలిలో డచ్ వాళ్లు దిగారు. 1624లో డచ్ వారు ఇక్కడకు మొదట వలస వచ్చారు. ఆ సందర్భంగా వారికి మన వాళ్లకి మధ్య పోరు జరిగింది. ఆ ఘర్షణలో 101 మంది డచ్ సైనికులు, 200 మంది ప్రాంతీయులు మరణించారు. ఆ తర్వాత సంధి కుదిరి, వర్తకం చేసుకోవడానికి 1661లో అక్కడ ఈ కోట నిర్మించుకున్నారని అక్కడున్న శిలాఫలకాలపై రాసి ఉంది. ఈ కోట బాగా శిథిలమైంది. ఇక్కడే గడియార స్తంభం, టంకశాల ఉన్నాయి. దగ్గరలోనే ఉన్న దీపస్తంభం (లైట్‌హౌస్) చాలా అందంగా ఉంది. దీన్ని 18వ శతాబ్దంలో నిర్మించారట. ఇది అప్పటి వైభవాన్ని తెలియజేస్తుంది.

ఇక్కడ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటున్న ఓ 'కలప కళాఖండం' గురించి తప్పక చెప్పుకోవాలి. పెద్ద పడవలో వివిధ భంగిమల్లో ఉన్న నలుగురు బెస్తవారు తెడ్లు వేస్తూ నడుపుతున్న దృశ్యమే ఆ కళాఖండం. దీన్ని చెక్కతో తయారుచేసి రోడ్డుపై ఉంచారు. అత్యద్భుతంగా ఉంది.

రోడ్డు అంచునే సముద్రం. నీలిరంగు సముద్రానికి పచ్చరంగు అంచులాగా బీచ్ పొడవునా పచ్చని కొబ్బరిచెట్లు చాలా అందంగా ఉన్నాయి. ఆ కొబ్బరి చెట్ల నీడలో సిమెంటు బెంచీలున్నాయి. అక్కడ కూర్చొని కడలి కెరటాల సయ్యాటలను ఆస్వాదిస్తూ ఎంతసేపైనా గడిపేయవచ్చనిపించింది. ఆ చల్లగాలి శరీరాన్ని సేద తీరిస్తే, ఆ చుట్టూ ప్రకృతి ఎంతో ఆహ్లాదంగా

మనస్సుకు హాయి గొలిపింది. అక్కడ మెడవరకూ ఉన్న బుద్ధుని విగ్రహం కూడా చాలా అందంగా ఉంది. అలా ఇసుకలో నడుచుకుంటూ పిల్లల్ని పట్టుకుని సముద్రం చెంతకు చేరాం. సముద్రం నుండి కెరటాలు ఎగసిపడుతూ 'వచ్చారా!' అన్నట్లు దగ్గరగా వచ్చి తాకి మరీ వెనక్కు వెళ్లడం.. భలే బాగుంది. పిల్లలు ఆ కెరటం వచ్చి వెళ్లేప్పుడు కాళ్లకింద ఇసుక కదులుతుంటే ఒకటే కేరింతలు. ఆ అనుభూతే వేరు. అది అనుభవించిన ప్రతి ఒక్కరికీ మరపురాని జ్ఞాపకమే. కాసేపు అక్కడే గడిపాం.

రిషికొండ బీచ్... కనుచూపు మేర ఇసుకతిన్నెలు, తాటిచెట్లతో ఎంతో చూడచక్కగా ఉంది. ఇక్కడ బోటు షికారు చేసే సౌకర్యం ఉంది. మరీ చిన్నపిల్లలు ఉండడంతో మేం వెళ్లలేదు. చుట్టూ రెస్టారెంట్లున్నాయి. ఒడ్డునే ఉన్న పార్క్‌లోకి దారితీశాం. ఆ పార్కులో పిల్లలు ఆడుకోడానికి జారుడుబల్ల, సీసా వంటి ఆటవస్తువులు ఉన్నాయి. వెంట తెచ్చుకున్న పులిహోర, పెరుగన్నం అందరం కలిసి తినేశాం. ఆకలిమీద ఉన్నారేమో పిల్లలు కూడా పేచీల్లేకుండా తినేశారు. తర్వాత అందరం సముద్రం దగ్గరకు వెళ్లాం. మేమెళ్లిన చోట సముద్రం కొంచెం లోతుగా ఉంటుందంట. మరీ ముందుకు వెళ్లొద్దని అక్కడివాళ్లు హెచ్చరించారు. అందుకే మోకాళ్లలోతు వరకూ వెళ్లాం. అక్కడ లంగరు వేసిన పడవల్ని పట్టుకుని కాసేపు కెరటాలతో ఆడుకున్నాం.

అక్కడ నుండి కైలాసగిరికి వెళ్లాం. కొండ ఎక్కకుండా 'రోప్ వే' సౌకర్యం కూడా ఉంది. పిల్లలు సరదాపడుతుంటే వాళ్లని అందులో పంపించి, మేం వ్యానులోనే పైకి వెళ్లాం. కొండను ఎంతో అద్భుతంగా మలిచారు. కింద నుండి పై వరకూ ఆద్యంతం రకరకాల పూలమొక్కలతో ఎంతో మనోహరంగా తీర్చిదిద్దారు. కాసేపు ఆ మొక్కలను, పూలను ఆసక్తిగా గమనిస్తూ.. బాగా నచ్చినవాటిని చేతితో తాకుతూ.. అలా మెల్లగా పైకి ఎక్కాం. పైన వాతావరణం మరింత శోభాయమానంగా ఉంది. పై నుండి కిందకు పరికించగానే...ఓవైపు అనంతంగా సాగుతున్న సముద్రం. మరోవైపు విస్తరించిన పట్టణం.. చాలా అద్భుతంగా ఉందా దృశ్యం. బైనాక్యులర్స్‌తో అక్కడ నుంచి చూస్తే రామకృష్ణ బీచ్.. ఆ తీరం వెంబడి పర్యాటకులు.. ఎగసిపడుతున్న కెరటాలు.. ఓహ్.. చెప్పటం కాదు.. చూసి తీరాల్సిందే. అక్కడ నిలబడితే వెనుకభాగంలో సుదూరంగా సముద్రతీరం.. అబ్బా.. అత్యద్భుతం ఆ దృశ్యం. ఎలా అంటే...చెయ్యితిరిగిన చిత్రకారుడు గీసిన చిత్రంలా ఉందనుకోండి. అలాగే ఆ కొండపైన శివపార్వతుల విగ్రహాలు మరో హైలైట్. అంత పెద్దగా మలచిన శిల్పకారుడిని మెచ్చుకుని తీరాల్సిందే. చుట్టూ అందమైన పూలమొక్కలు, మధ్యలో చిన్న జలపాతం.. ఓహ్.. మనోహరం ఆ దృశ్యాలన్నీ. మొత్తం గార్డెన్‌లో కొన్ని లతల్ని ఆర్చీల్లా మలిచారు. ఇక అక్కడ నుండి కిందకు వచ్చాం.

రామకృష్ణ బీచ్‌లోకి అడుగుపెట్టాం. దీన్నే ఆర్.కె.బీచ్ అని పొట్టిగా పిలుస్తారు. అచ్చం మనం సినిమాల్లో చూస్తున్న బీచ్‌లాగా ఉంది. అన్ని ఏర్పాట్లూ ఉన్నాయి. వేరుశనక్కాయలు వంటి తినుబండారాలు అమ్మే చిరు వ్యాపారుల నుండి ఓ మాదిరి షాపుల వరకూ... ఒకటేమిటి అన్నీ ఉన్నాయి అక్కడ. ముందుకు వెళ్లాక ఎంతో పద్ధతిగా సముద్రం దగ్గరకు వెళ్లే ఏర్పాట్లు ఉన్నాయి. అందరం ఒకరిచేతులు ఒకరం గట్టిగా పట్టుకుని సముద్రం దగ్గర కెరటాలకు ఎదురు నుంచున్నాం. మోకాళ్లు మునిగే అంతదూరం వెళ్లి ఆగిపోయాం. ఈలోపు ఓ పెద్ద కెరటం వచ్చింది. అంతే అందరం పూర్తిగా తడిచిపోయాం. కానీ అది కిందకు పడిపోయి వెనక్కు వెళ్లగానే పెద్దలూ పిల్లలై ఒకటే కేరింతలు. కొద్దిసేపయ్యాక సూర్యుడు అస్తమిస్తున్న దృశ్యం. ఓహ్.. ఆ దృశ్యం ఎంత అత్యద్భుతంగా ఉందో మాటల్లో చెప్పలేం. చూసి తీరాల్సిందే..! ముదురు నారింజరంగులో అస్తమిస్తున్న సూర్యుడు నిజంగా సముద్రం లోపలికి వెళ్లిపోతున్నట్లు.. వెళుతున్నప్పుడు సముద్రంలో దాని ప్రతిబింబం ఎంత అందంగా ఉందో..!

ఆర్‌కె బీచ్‌లోనే నాడు మన దేశ విజయానికి ప్రతీకగా నిలిచిన కురుసుర జలాంతర్గామిని పర్యాటకులు వీక్షించేందుకు వీలుగా మ్యూజియంగా మలిచారు. భారత్-పాక్ యుద్ధంలో దేశ గౌరవానికి, ప్రతిభాపాటవాలకు ప్రతిరూపంగా నిలిచి భారత విజయానికి ప్రతీకగా నిలిచిందది. నౌకాదళ పనితీరు తెలుసుకోవాలంటే జలాంతర్గామిని సందర్శించాల్సిందే. దీన్ని ఇలా తీర్చిదిద్దడానికి ఏడాది పట్టిందంట. ఇది 2002, ఆగస్టు 9 నుండి పర్యాటకులకు కనువిందు చేస్తోంది. ఆయుధ సామగ్రినంతా అలాగే ఉంచారు. మనం చూసేందుకు వీలుగా ద్వారాలను కొంత మార్పు చేశారు. అయినా ఒకరి తర్వాత ఒకరు వెళ్లాల్సిందే. 91.3 మీటర్ల పొడవున్న దీన్ని ఆసాంతం చూడాలంటే సుమారు అరగంట పడుతుంది. అంతసేపు లోపల సందర్శకులకు ఇబ్బంది కలగకుండా 21 ఏసి మిషన్లను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు మధ్యాహ్నం రెండు గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మాత్రమే చూడనిస్తారు. ప్రతి సోమవారం సెలవు ఉంటుంది. దీన్ని చూసేందుకు పెద్దలకు రూ.25, పిల్లలకు రూ.15 సందర్శనా రుసుము వసూలు చేస్తున్నారు. వికలాంగులకు ఉచితం. ఇందులో సుమారు వందమంది సిబ్బంది పనిచేస్తున్నారు.

షిప్‌యార్డ్ దగ్గరకు వెళ్లాలంటే లాంచీల్లో వెళ్లాల్సిందే. ఆ లాంచీ ఎక్కడానికి టిక్కెట్ సౌకర్యం ఉంది. అరగంటసేపు క్యూలో నిలబడి టిక్కెట్ తీసుకుని లాంచీ ఎక్కాం. అది ఎక్కి అవతలివైపున్న కొండ దగ్గరకు చేరుకోవాలి. ఆ కొండమీద చిన్న గుడి ఉంది. ఆ కొండ దగ్గర నుండి చూస్తే ఎన్నో నౌకలు చమురు, బొగ్గు, తదితర సరకుల లోడ్‌తో కనిపిస్తుంటాయి. అంత దగ్గరగా వాటిని చూస్తుంటే చాలా ఆనందంగా అన్పించింది. ఒక్కో నౌక చిన్న ఊరిలాగా ఉంది.

ఏమైనా విశాఖతీర ప్రాంత సందర్శన ఓ మరుపురాని అనుభూతిగా మదిలో నిలిచిపోతుందంటే అతిశయోక్తి కాదు.

**- శాంతిశ్రీ**



కురుసుర జలాంతర్గామి

'కలప కళాఖండం' దగ్గర ఫోటో ముచ్చట



# అగ్రరాజ్యం ఉగ్రదాడులు

మొన్న యుగోస్లావియా, ఆఫ్ఘనిస్తాన్... నిన్న ఇరాక్, లిబియా...ఇలా ఒక దేశం తరువాత మరొక దేశాన్ని ఆక్రమిస్తూ, ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల సంఖ్యలో అమాయకుల ప్రాణాలను బలిగొంటూ తిరిగి కోలుకోలేని విధంగా వనరులకు, ఆస్తులకు నష్టం కలిగిస్తున్న మాన్‌స్టర్ (రాకాసి) అమెరికా దృష్టి ఇప్పుడు ఇరాన్‌పై పడింది. దీనికి ముందు సిరియాను మింగేయాలని చూసింది. చైనా, రష్యా అడ్డుపడడంతో ఇప్పుడు ఇరాన్‌తో కయ్యానికి కాలు దువ్వుతోంది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని బూచిగా చూపి దానిపై దాడికి తెగబడేందుకు సిద్ధమవుతోంది. అబద్ధపు ప్రచారాలు, ఆంక్షలు, బెదిరింపులు, ఒత్తిళ్లు, దాడులతో ఇరాన్‌ను జయించవచ్చని భావిస్తున్నది. ఈ నేపథ్యంలో అమెరికా కుతంత్రం ఫలిస్తుందా? ఇరాన్‌పై దాడి చేస్తే దాని పర్యవసానాలెలా ఉంటాయి? అన్న అంశాలు చర్చనీయాంశంగా మారాయి. ఆ వివరాల సమాహారమే ఈ వారం అట్టమీది కథ ....



- కె. గడ్డెన్న

**ఒ**క దురాక్రమణ తరువాత మరొక దురాక్రమణ ఇదీ నేటి అమెరికా తీరు. ఈ విధంగా గత పదమూడేళ్లలో నాలుగు యుద్ధాలను అది అన్యాయంగా ప్రపంచంపై రుద్దింది. పచ్చి అబద్ధాలను ప్రచారంలో పెట్టి యుగొస్లావియా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియాలను ఎలా కబళించిందీ, నజీబుల్లా, సద్దాం హుస్సేన్, గడాఫీలను ఎంత దుర్మార్గంగా చంపించిందీ చూశాము. ఒసామా బిన్ లాడెన్‌ను హత్య చేసిన తీరు కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు కలిసి ఈ దేశాల్లో సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. లక్షల మంది అమాయక పౌరుల ప్రాణాలను బలిగొన్నాయి. పెద్దయెత్తున ప్రజల ఆస్తులను ధ్వంసం చేశాయి. వీటిలో మూడు దేశాల్లో ఇప్పటికే అమెరికా తిష్టవేసింది. అయినా, దాని సామ్రాజ్యవాద కాంక్ష తీరలేదు. రక్తం రుచి మరిగిన పులిలా ఎగిరెగిరి పడుతున్నది. మధ్య ప్రాచ్యంలో వనరులతో సుసంపన్నమైన ఇరాన్‌పై ఇప్పుడు దాని కన్ను పడింది. అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై దాడికి కత్తులు నూరుతున్నాయి. ఒబామా ప్రభుత్వం ఒకవైపు ఇరాన్‌తో చర్చలు అంటూనే మరోవైపు నుంచి ఆంక్షల మీద ఆంక్షలు విధిస్తోంది. ఇరాన్‌ను బలహీనపరిచేందుకు అన్ని రకాల కుట్రలు పన్నుతోంది. తాను శత్రువుగా ముద్ర వేసిన వారిని బాహాటంగానే వెంటాడి, వేటాడి వధించడం అమెరికా నైజం. ఈ విషయంలో అంతర్జాతీయ నియమాలు, చట్టాలు వేటినీ అది ఖాతరు చేయదు. ఇరాన్‌పట్ల కఠినంగా వ్యవహరించాలని ఇజ్రాయిల్ లాబీ, అమెరికా చమురు మాఫియా కోరగానే ఆ దేశాన్ని దుష్ట రాజ్యాల జాబితాలో చేర్చింది. కుట్రలు, కుతంత్రాలలో ఆరితేరిన అమెరికన్ గూఢచారి సంస్థ సిఐఎ, ఇజ్రాయిల్ గూఢచారి సంస్థ మొసాద్‌లతో బాటు ఐఎఇఎ వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి కూడా తప్పుడు నివేదికలను సృష్టించి వాటినే పరమ సత్యాలుగా ప్రచారంలో పెడుతోంది. దీంట్లో భాగంగానే ఇరాన్ అణు బాంబు తయారు చేస్తోందని, అమెరికాలోని సౌదీ అరేబియా రాయబారి హత్యకు కుట్ర పన్నిందన్న ఆరోపణలను అమెరికా, దాని అధీనంలోని ప్రచార బాకాలు విస్తృతంగా ప్రచారంలో పెడుతున్నాయి. వీటికి ఏమిటి ఆధారమంటే గూఢచారి సంస్థల నివేదికలను చూపుతున్నాయి. ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ సామూహిక విధ్వంసకర ఆయుధాలను

కలిగిఉన్నాడంటూ ఆ దేశంపై అమెరికా దురాక్రమణకు తెగబడినట్లే ఇప్పుడు ఇరాన్‌పై దాడికి కుంటి సాకులు వెతుకుతోంది. ఇరాక్‌లో అటువంటి ఆయుధాలేమీ లేవని తెలిసి కూడా అమెరికా దురాక్రమణకు పూనుకున్న విషయం మరువలేదు. ఇప్పుడు ఇరాన్ విషయంలోనూ అదేవిధమైన తప్పుడు ప్రచారం మొదలెట్టింది. పశ్చిమ దేశాల చెప్పుచేతల్లోని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) చేత యురేనియం శుద్ధి చేసే సదుపాయాలను నజా లోని భూగర్భ ప్రదేశాల నుంచి పవిత్ర నగరం ఖామ్‌కు తరలించే సన్నాహాలు చేస్తోందంటూ ఒక తప్పుడు నివేదిక తయారు చేయించింది. ఐఎఇఎ విడుదల చేయకముందే అమెరికా ఆ నివేదికలోని అంశాలను మీడియాకు లీక్ చేసింది. ఇరాన్‌ను అభిశంసిస్తూ ఐఎఇఎ తెచ్చిన తీర్మానాన్ని ఒక ఆయుధంగా వాడుకోవాలన్నదే అమెరికన్ యుద్ధ లాబీ తాపత్రయం. ఆ తీర్మానంలో అమెరికా, ఇజ్రాయిల్ గూఢచారి సంస్థలు సేకరించినట్లుగా చెప్పబడుతున్న ఆధారాలనే వల్లెవేశారు. అందుకే దీనిని ఐఎఇఎ గవర్నర్ల బోర్డులో సభ్య దేశాలైన క్యూబా, ఈక్వెడార్ గట్టిగా వ్యతిరేకించాయి. ఇండోనేషియా ఓటింగ్‌కు గైర్హాజరు కాగా, భారత్ మాత్రం తగుదునమ్మా అంటూ దానికి అనుకూలంగా ఓటు చేసింది. ఐఎఇఎ తీర్మానాన్ని ఆమోదించిన వారం రోజుల్లోనే అమెరికాలోని సౌదీ అరేబియా రాయబారిపై హత్యాయత్నాన్ని ఖండిస్తూ ఐరాస జనరల్ అసెంబ్లీలో మరో తీర్మానం రాగా భారత్ ఈసారి ఓటింగ్‌కు గైర్హాజరైంది. సౌదీ అరేబియాలో అమెరికా రాయబారి హత్యకు ఇరాన్ కుట్రపన్నిందనేది అమెరికా ఆరోపణ. అమెరికా గడ్డపై ఒక విదేశీ దౌత్యవేత్తను హత్య చేసే సాహసానికి ఇరాన్ ఒడిగడుతుందని అంటే ఎవరైనా నమ్ముతారా? అయినా ఇటువంటి అబద్ధాలను ప్రచారంలో పెట్టి ఇరాన్‌పై దాడికి తగిన భూమికను కల్పించుకోవాలని అమెరికా చూస్తోంది.

**ఇరాన్‌కు ఆ హక్కు లేదా?**

అణువ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి)పై సంతకం చేసిన ఇరాన్‌కు శాంతియుత ప్రయోజనాల కోసం అణు ఇంధనాన్ని అభివృద్ధి పరచుకునే హక్కు ఉన్నది. ఆ మాటకొస్తే 30 దేశాలు ఇప్పటికే అణుశక్తిని కలిగి ఉన్నాయి. మరో 65 దేశాలు అణు విద్యుత్ పట్ల ఆసక్తి కనబరుస్తున్నాయని ఐఎఇఎ తాజాగా వెల్లడించిన ఒక పత్రంలో పేర్కొంది. అలాంటప్పుడు ఆ దేశాలన్నిటినీ విడిచిపెట్టి ఇరాన్‌నే లక్ష్యంగా పెట్టుకోవడంలో ఔచిత్యమేమిటి? తన దగ్గర ప్రపంచాన్ని వెయ్యి సార్లు భస్మీపటలం చేసేంతటి శక్తిగల 10వేల అణ్వాయుధాలను నిల్వ ఉంచుకుని ఇరాన్ అణు కార్యక్రమాన్ని భూతద్దంతో చూడడం అమెరికాకే చెల్లింది. పశ్చిమాసియాలో అమెరికాకు ఏజెంటుగా వ్యవహరించే ఇజ్రాయిల్ వద్ద వందల సంఖ్యలో అణ్వాయుధాలు ఉంటే దాని గురించి ఎవరూ మాట్లాడరు. వీటి గురించి ఐఎఇఎ కూడా ప్రశ్నించదు. అణ్వాయుధాలు తమ దగ్గర ఉంటే ప్రపంచానికి సురక్షితం, వేరొకరి దగ్గర ఉంటే ప్రమాదకరం అన్నట్లుగా అమెరికా, ఇజ్రాయిల్, యూరపు దేశాలు వ్యవహరిస్తున్నాయి. ఎందుకీ ద్వంద్వ ప్రమాణాలు? అమెరికా సరే, ఐఎఇఎ బుద్ధి ఏమైంది? ఇజ్రాయిల్ దగ్గర పేరుకుపోయి ఉన్న అణ్వాయుధాల ఊసే ఎత్తని ఈ అణు తనిఖీ సంస్థ ఇరాన్‌లో అణు ఇంధన కేంద్రాల్లో కెమెరాలు పెట్టి అణువణువునా శోధిస్తోంది. 2003లో ఇరాక్‌పై దాడికి వీలుగా అక్కడ సామూహిక విధ్వంసకర ఆయుధాలున్నాయని అమెరికా ప్రచారం చేస్తే దానికి ఐఎఇఎ వంతపాడింది. ఇప్పుడు ఇరాన్ విషయంలోనూ అదే జరుగుతోంది. ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అపోహలు, అప నమ్మకాలు కలిగించడం కోసం అసత్య ప్రచార జోరు పెంచింది. ఒక వైపు సంప్రదింపులు చేస్తూనే ఇంకో వైపు పైలట్ రహిత యుద్ధవిమానాలు (డ్రోన్స్), రాకెట్లు, క్షిపణులను ఇరాన్ చుట్టూ మోహరిస్తున్నది.

**ఇరాన్ అణు శాస్త్రవేత్తల హత్యా పరంపర**

అదే సమయంలో ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు అమెరికా, ఇజ్రాయిలీ గూఢచార సంస్థలు ఆ దేశానికి చెందిన అణు శాస్త్రవేత్తలను అంతమొందించే కార్యక్రమం చేపట్టాయి. 2010 జనవరిలో టెహ్రాన్ విశ్వవిద్యాలయానికి చెందిన అణు భౌతిక శాస్త్రవేత్త మసూద్ అలీ మహ్మద్ మోటార్ సైకిల్ బాంబు ప్రేలుడులో చనిపోయాడు. ఆ తరువాత పది మాసాలకు మరో ప్రముఖ అణుశాస్త్రవేత్త డెరియర్ రిజెను టెహ్రాన్‌లో బాంబులతో దాడి చేసి హతమార్చారు. గత జులైలో మజీద్ షాహ్రియార్ అనే మరో ఇరానియన్ అణు శాస్త్రవేత్తను కాల్చి చంపారు. ఒక్క ఏడాదిన్నర వ్యవధిలోనే ముగ్గురు అణుశాస్త్ర వేత్తలు హత్యకు గురయ్యారంటే దీని వెనక పెద్ద కుట్రే దాగి ఉంది. ఈ వరుస ఘటనల తరువాత ఇరాన్ ప్రభుత్వం తమ అణుశాస్త్రవేత్తల రక్షణకు ప్రత్యేక దళాలను నియమించింది. ప్రపంచం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో ఇరాన్‌పై ఆర్థికపరమైన ఆంక్షలను అమెరికా, కెనడా, ఫ్రాన్స్ ఇతర యూరోపియన్ దేశాలు విధించాయి. ఇరాన్ బ్యాంకులతో వాణిజ్య సంబంధాలను రద్దు చేశాయి. ఇరాన్ కంప్యూటర్‌లోకి వైరస్ పంపడం ద్వారా అణు కార్యక్రమ డేటాను ధ్వంసం చేసే విద్రోహ చర్యలకు కూడా అమెరికా, ఇజ్రాయిల్ గూఢచార సంస్థలు ప్రయత్నించాయి. ఇరాన్‌పైనే కాదు, ఇరాన్‌కు అండగా నిలిచిన సిరియాపై కూడా కత్తిగట్టాయి. అమెరికా ఒత్తిడి మేరకే అరబ్ లీగ్ నుంచి సిరియాను సస్పెండ్ చేయించాయి. ఆ దేశంపై ఆంక్షలు విధించాయి. లిబియా మాదిరిగా సిరియాపై కూడా నాటో దళాల ప్రత్యక్ష దాడికి వీలు కల్పించే ఐరాస తీర్మానం (1973)



ఇజ్రాయిల్ ప్రధాని
ఎహుడ్ ఆల్మర్ట్

## ఇరాన్ గురించి....

**ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్**

**(1935కి ముందు పర్షియా అని పిలువబడేది)**

**రాజధాని:** టెహ్రాన్

**ఇరాన్ జనాభా:** 7,80, 00,000

**వైశాల్యం:** 16,48,195 చ.కి.మీ

**అధికార భాష:** పార్సీ

**మాట్లాడే ఇతర భాషలు:** ఆర్మీనియన్, కుర్దిష్, అరబిక్, తుర్కుమెన్, బలోచి, మజుందర్, లోరి మొదలైనవి

**ప్రసిద్ధి:** చమురు, సహజవాయువు

**సగటు ఆయుః ప్రమాణం:** 70 సంవత్సరాలు.

**ప్రధాన మతం:** ముస్లిం (షియా తెగ 89శాతం, సున్నీ 10శాతం)

**ఇతర మతాలు:** క్రిస్టియన్. జోరాస్ట్రియన్, బాహల్, యూదు (ఒక శాతం)

**సరిహద్దు దేశాలు:** ఉత్తరాన ఆర్మీనీయ, అజర్‌బైజాన్, తుర్కుమెనిస్థాన్, కజకిస్థాన్, రష్యా తూర్పున ఆఫ్ఘనిస్తాన్,పాకిస్తాన్.
దక్షిణాన పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్, పశ్చిమాన ఇరాక్. వాయువ్యాన టర్కీ.

మండలిలో అమెరికా ప్రతిపాదించగా చైనా, రష్యాలు దానిని వీటో చేశాయి. ఆ తీర్మానాన్ని గనుక అడ్డుకోక పోయి వుంటే పశ్చిమ దేశాలు ఈపాటికి సిరియా పీక నులిమేసి ఉండేవి.

### ఇరాన్‌పై ఎందుకింత కక్ష?

ఇరాన్ నుంచి అమెరికా, బ్రిటన్ సామ్రాజ్యవాదులను తరిమేసిన తరువాత 1979లో అన్ని చమురు ఉత్పత్తి కేంద్రాలను ప్రభుత్వం జాతీయం చేసింది. ఇక అప్పటి నుంచి ఇరాన్‌లో ప్రభుత్వాన్ని అస్థిరత్వ పాల్జేసి, అక్కడి సంపదను తిరిగి చేజిక్కించుకోవడానికి పశ్చిమ దేశాల బ్యాంకులు, కార్పొరేట్ సంస్థలు విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి.. సామ్రాజ్యవాదులు అంతకుముందు తన పట్ల చూపిన వివక్ష, ఏళ్ల తరబడి కొనసాగించిన ఆంక్షలను దృష్టిలో ఉంచుకుని ఇరాన్ చమురు శుద్ధి రంగంలో స్వావలంబనపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. శుద్ధి చేసిన చమురు, గ్యాస్, కిరోసిన్ వంటి పెట్రో ఉత్పత్తులను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంది. 2008 వరకు దాదాపు ఇదే పరిస్థితి. ఇప్పటికీ అది తన మార్కెట్ అవసరాలను తీర్చేందుకు 40శాతం దాకా శుద్ధి చేసిన చమురు ఉత్పత్తుల దిగుమతులపైనే ఆధారపడుతోంది. నిర్మాణంలో ఉన్న ఏడు కొత్త రిఫైనరీలు పూర్తయి, ప్రస్తుత రిఫైనరీల సామర్థ్యాన్ని పెంచుకుంటే చమురు రిఫైనరీ రంగంలో అది పూర్తి స్వావలంబన సాధిస్తుంది. ఇరాన్ ఆ దిశగా చేస్తున్న కృషికి అమెరికా అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తున్నది. చమురు శుద్ధి టెక్నాలజీని, రిఫైనరీలో అంతర్జాతీయ పెట్టుబడులను అడ్డుకుంటున్నది. ఇరాన్‌పై ఎలాగైనా పట్టు సాధించాలన్న ఉద్దేశంతో పెంటగాన్ కవ్వింపు చర్యలకు దిగుతోంది.

రిపబ్లికన్లు, డెమోక్రాట్లు ఎవరు అధికారంలో ఉన్నా ఇరాన్‌పట్ల అమెరికా వైఖరిలో ఎలాంటి మార్పు లేదు. ఒబామా అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు ఇరాన్‌తో కఠినంగా వ్యవహరించేందుకు ఇజ్రాయిల్‌కు మద్దతివ్వాలని చెప్పాడు. అధికారంలోకి వచ్చాక ఆ విధానాన్నే ఉధృతంగా అమలు చేశాడు. అందుకు అవసరమైన మందుగుండు సామగ్రిని కార్పొరేట్ మీడియా వీరికి అందిస్తూనే ఉంది.

### దాడి అంత సులువేమీ కాదు

అమెరికా, ఇజ్రాయిల్ ఇతర పశ్చిమ దేశాలు ఇరాన్‌పై దాడి చేస్తామంటూ గత అయిదేళ్లుగా బెదిరిస్తూనే ఉన్నది. ఇటువంటి తాటాకు చప్పుళ్లకు తాను బెదరబోనని ఇరాన్ కూడ అంతే దీటుగానే బదులిస్తున్నది. బెదిరింపులతో ఇరాన్‌ను లొంగదీసుకోవడం సాధ్యం కాదని అమెరికాకూ తెలుసు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఎలాగైనా అడ్డుకోవాలని అమెరికాను దేబిరించే బదులు ఇజ్రాయిల్ తానే నేరుగా ఎందుకు దాడి చేయడం లేదు? దాడి చేస్తే ఏం జరుగుతుందో ఇజ్రాయిల్‌కు బాగా తెలుసు. అమెరికా ఆర్థిక, సైనిక సహకారం లేకుండా ఇజ్రాయిల్ దాడి చేస్తే ఏవో ఒకటి రెండు దేశాలు మినహా యావత్ అరబ్ ఒక్కటై ఎదురు తిరుగుతుంది. అందుకే వ్యూహాత్మకంగా అమెరికా, నాటోలను ముందుకు తీసుకొస్తున్నది. ఇరాక్‌పై ఐరాస అనుమతి లేకుండానే ఏకపక్షంగా దాడి చేసిన అమెరికా, ఇరాన్ దగ్గరకొచ్చేసరికి తటపటాయించడానికి కూడా కారణం ఇదే. లిబియాపై దాడి చేసి ఆ దేశాన్ని వశపరచుకున్నట్లుగా ఇరాన్‌ను కూడా అమెరికా వశపరచుకోవచ్చని ఎవరైనా అనుకుంటే అంతకన్నా పొరపాటు మరొకటి




## అమెరికా- ఇరాన్ ప్రతిష్టంభన కొన్ని నిజాలు

♦ ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమం చేపట్టిందనడానికి ఎలాంటి ఆధారాలు లేవు. అయినా తాను ఎలాంటి అణు రహస్యాలు దాయలేదని ఇరాన్ నిరూపించుకోవాలని అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు ఒత్తిడి తెస్తున్నాయి. దీనిని సాకుగా తీసుకుని ఇరాక్, లిబియాలలో మాదిరిగా ఇరాన్‌లోనూ ప్రభుత్వాన్ని కూలదోయాలని చూస్తున్నాయి. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) ఇన్‌స్పెక్టర్ల బృందం 2,700 గంటల పాటు తనిఖీ చేసినా ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేస్తున్నట్లు ఎలాంటి ఆధారాలను సేకరించలేకపోయింది. 2004లో నంటాజ్‌లో శుద్ధి చేసిన యురేనియం జాడలు కొంచెం కనిపించాయని అది పేర్కొంది.

♦ ఇరాన్‌కు అణు విద్యుత్ అవసరం ఉందనేది నిజం. ఇరాన్‌లో చమురు నిల్వలు వేగంగా అడుగంటుతున్నందున ఏడు కోట్ల ఇరానియన్ల అవసరాలను తీర్చడానికి అణువిద్యుత్ అవసరం గనుక 20 అణు రియాక్టర్లను తమ నుంచి కొనుగోలు చేయాల్సిందిగా డిక్ చెనీ, డోనాల్డ్ రమ్స్‌ఫెల్డ్, పాల్ ఉల్ఫో విట్జ్ వంటివారు 1975లో అమెరికా అధ్యక్షుడు గెరాల్డ్ ఫోర్డు తరపున అప్పటి ఇరాన్ (రాజు) షా మహ్మద్ రజా పహ్లవి పై ఒత్తిడి తెచ్చారు. ఈయన అమెరికా అనుకూలుడైన రాజుగా పేరొందాడు.

♦ ఇరాన్ అణు కార్యక్రమం చేపట్టిన తరువాత అణుబాంబు తయారు చేయడానికి అవసరమైన అత్యంత నాణ్యమైన శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్ సమకూర్చుకోవాలంటే కనీసం మరో పదేళ్లు పడుతుందని 20 05లో సిఐఎ తన నివేదికలో పేర్కొంది. అణు విద్యుత్ ఉత్పత్తికి 3.5 శాతం శుద్ధి చేసిన యురేనియం చాలు, అదే అణు బాంబు తయారు చేయాలంటే 85శాతం శుద్ధి అయిన ఏ క్లాస్ యురేనియం అవసరమని, ఇప్పుడు అణు బాంబు తయారు చేసే స్థాయిని అందుకోగల సాంకేతిక సామర్థ్యం ఇరాన్‌కు లేదని స్వతంత్ర అణు నిపుణులు పలువురు చెబుతున్నారు. ఆక్స్‌ఫర్డ్ రిసెర్చ్ గ్రూపునకు చెందిన డాక్టర్ ఫ్రాంక్ బార్నబే మాట్లాడుతూ ఇరాన్ యురేనియం హెవీ మెటల్స్‌తో కూడినది గనుక అది ఇతర దేశాల సహకారం లేకుండా 20 శాతానికి మించి నాణ్యత కలిగిన యురేనియంను శుద్ధి చేయగలిగే పరిస్థితి ఇరాన్‌కు లేదని చెప్పారు.

♦ అణువ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి)పై సంతకం చేసిన దేశం ఇరాన్. ఐఎఇఎ నిర్దేశించిన మార్గదర్శకాలను అది కచ్చితంగా పాటిస్తున్నది. ఇరాన్ వద్ద సామూహిక విధ్వంసకర ఆయుధాలు ఉన్నాయని అమెరికా చేస్తున్న ప్రచారం శుద్ధ అబద్ధం. 1980లలో ఇరాన్- ఇరాక్ యుద్ధం సందర్భంగా ఇరాక్‌కు రసాయన ఆయుధాలను అందించిన చరిత్ర అమెరికా,

జర్మనీ, బ్రిటన్‌లకే ఉంది. ఈ ఆయుధాలనే సద్దాం ఇరాన్ సైనికులపైన, పౌరులపైన ఆనాడు ప్రయోగించాడని ఇరాన్ పేర్కొంది.

♦ ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని దాచి పెట్టిందెన్నడూ లేదు. తన దేశంలో సంయుక్త రంగంలో అణు కార్యక్రమాన్ని తనిఖీ చేసేందుకు ముందుకు రావాలని ఇరాన్ పశ్చిమ దేశాల కంపెనీలను ఆహ్వానించింది. ఇందుకోసం అనేక రాయితీలు కూడా ప్రకటించింది. ఆనాడు అమెరికా, దాని మిత్ర పక్షాలు ఇరాన్ ఆఫర్‌ను తిరస్కరించాయి.

♦ పౌర ప్రయోజనాల కోసం శుద్ధి చేసిన యురేనియంను వాడుకునేందుకు, అందుకవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకునే హక్కు ఎన్‌పిటిపై సంతకం చేసే ప్రతి దేశానికి ఉన్నట్లుగానే ఇరాన్‌కూ ఉంది.

♦ ఇరాన్ అణు కార్యక్రమంపై తలెత్తిన ప్రతిష్టంభనను పరిష్కరించుకునేందుకు అమెరికా, ఇతర పశ్చిమదేశాలు ఎన్నడూ చిత్తశుద్ధితో ప్రయత్నించిన దాఖలాలు లేవు. బెదిరింపులు, ఆంక్షలపైనే అవి ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా అవి రకరకాల అనుమానాలను లేవనెత్తుతున్నాయి. వీటికి అంతమంటూ లేకుండా పోయింది.

♦ 2000 సంవత్సరంలో దక్షిణ కొరియా అణు బాంబు తయారీకి దగ్గరగా అంటే 77 శాతం మేర యురేనియంను శుద్ధి చేసే స్థితికి వస్తే దానిపై ఐరాస భద్రతా మండలికి దానిని అమెరికా నివేదించలేదు. అమెరికాకు సన్నిహితంగా ఉన్న ఇజ్రాయిల్ వద్ద వందల సంఖ్యలో అణ్వాయుధాలు ఉన్నా దాని గురించి అది ఎన్నడూ మాట్లాడదు. శాంతియుత ప్రయోజనాల కోసమే తన అణు కార్యక్రమం ఉద్దేశించబడిందని ఇరాన్ పదే పదే చెబుతున్నా దానిని అభిశంసిస్తూ ఐఎఇఎతో తీర్మానం చేయించింది. ఇది అమెరికా ద్వంద్వ ప్రమాణాలకు మరో నిదర్శనం.

♦ ఇరాన్ ఇజ్రాయిల్‌పై కానీ, మరే దేశంపై కానీ దాడి చేస్తానని ఎన్నడూ బెదిరించలేదు. అమెరికా, ఇజ్రాయిల్, బ్రిటన్, ఫ్రాన్స్‌లు అంతర్జాతీయ నియమాలను ఉల్లంఘించి ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని ఎలా కబళిస్తున్నాయో గత దశాబ్ది కాలంలో అవి సాగించిన దురాక్రమణ పూరిత యుద్ధాలు, యుద్ధ నేరాలే తార్కాణం.

♦ ఇరాన్‌లో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పేందుకు తాను కృషి చేస్తానని అమెరికా చెప్పడం మరో పెద్ద అబద్ధం. అన్ని రకాల అంతర్జాతీయ నియమాలను, మానవహక్కులను, ప్రజాతంత్ర హక్కులను కాలరాయడంలో ప్రథమ ముద్దాయిగా ఉన్న అమెరికా ఇతర దేశాల్లో ప్రజాస్వామ్యం, విలువల గురించి మాట్లాడుతోంది. తమ దోపిడీని ప్రపంచంలో ఎవరూ ప్రశ్నించరాదన్న అమెరికా పాలకుల దుర్మార్గానికి ఇదొక నిదర్శనం.

ఉండదని ఇరాన్ నేత ఒకరు కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. ఐరాస భద్రతా మండలి తీర్మానాన్ని అడ్డం పెట్టుకుని లిబియాపై అమెరికా, నాటో దాడులకు దిగాయి. అటువంటి తీర్మానం ఏమీ లేకుండా ఇరాన్‌పై నాటో దాడికి దిగితే దాని పర్యవసానాలెలా ఉంటాయో అమెరికాకు తెలుసు. ఈ దాడికి వ్యతిరేకంగా షియాలు, సున్నీలంతా ఏకమై తిరగబడినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇరాన్‌పై దాడి జరిగిన మరు క్షణమే పాలస్తీనా నుంచి హమాస్, లెబనాన్ నుంచి హిజ్బుల్లాలు ఇజ్రాయిల్‌పై దాడులకు దిగితే అప్పుడు ఇజ్రాయిల్ పరిస్థితి ఏమిటి? ఇరాన్‌పై దాడికి సంబంధించిన ఎలాంటి చర్యనూ సమర్థించేది లేదని చైనా, రష్యాలు ఇప్పటికే తేల్చిచెప్పాయి. ఇంతకు ముందు ఇజ్రాయిల్‌కు గట్టి దన్నుగా నిలిచిన ఈజిప్టు ఇప్పుడు ఎలాంటి వైఖరి తీసుకోనుంది అన్నది ప్రశ్నార్థకమే. ఈజిప్టు, ఇజ్రాయిల్ మధ్య కుదిరిన 1979 శాంతి ఒప్పందానికి కాలం చెల్లే రోజులొచ్చాయి. ఇటువంటి పరిస్థితుల్లో కేవలం సౌదీ అరేబియా, యెమెన్, బహ్రెయిన్ వంటి వంటి దేశాల మద్దతుపై ఆధారపడి ఇరాన్‌పై దండెత్తితే ఎలాంటి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందోనన్న భయం అమెరికా, ఇజ్రాయిల్‌ను వెంటాడుతున్నది. ఇరాన్ మరో వియత్నాంగా మారితే వచ్చే ఏడాది నవంబరు జరిగే అధ్యక్ష ఎన్నికల్లో తన భవిష్యత్తు ఏమిటన్న గుబులు ఒబామాకు పట్టుకుంది. తమ అణు సదుపాయాలపై అమెరికా, ఇజ్రాయిల్ దాడి చేస్తే అవి భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుందని, అటువంటి తెలివి తక్కువ పనికి అవి పూనుకోవనే తాను అనుకుంటున్నానని ఇరాన్ అధ్యక్షుడు మహ్మద్ అహ్మదీ నెజాద్ ఘాటుగా హెచ్చరించాడు.

### చర్చలే మార్గం

అసత్యాలు, తప్పుడు నివేదికలు, ప్రచారాలు, ఆంక్షలు, దాడులతో ఇరాన్‌ను జయించవచ్చని అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు భావిస్తున్నాయి. ఇది అంత తేలికైన విషయమేమీ కాదు. అసలే ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని విలవిలలాడుతున్న అమెరికా మరో యుద్ధాన్ని భరించగలదా అన్న విషయం అలా ఉంచితే, ఈ యుద్ధం ద్వారా మధ్య ఆసియా శాంతి, సుస్థిరతలు తీవ్ర ప్రమాదంలో పడతాయనే విషయాన్ని అది గుర్తించడం లేదు. మధ్య ఆసియాలో అశాంతి చెలరేగితే చమురు ధరలు విపరీతంగా పెరిగిపోతాయి. దాంతో అది అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలో పడుతుంది. అంటే ఒక సంక్షోభం నుంచి బయటపడేందుకు మరొక సంక్షోభాన్ని సృష్టించడమే. ఇటువంటి మతిమాలిన చర్యలను అమెరికా కట్టిపెట్టి చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకునేందుకు కృషి చేయాలి. ★

## ఇరాన్ చరిత్ర సంక్షిప్తంగా

➽ క్రీ. పూ. 2,800లో ఇరాన్‌లో మొట్టమొదటి రాజవంశంగా ఎలామీ సామ్రాజ్యం పేర్కొనబడింది.

➽ క్రీ.పూ. 625లో ఇరానియన్ మేడాస్ ఇరాన్‌తో విలీనమై ఏకీకృత సామ్రాజ్యంగా అవతరించింది.

➽ ఆ తరువాత ఎకెమెనిడ్, మెలీన్ సెల్యూసిడ్ సామ్రాజ్యాలు నడిచాయి. క్రీ.శ. 651లో ముస్లింలు జయించక ముందు పార్థియన్లు, ససానిడ్లు పాలించారు. ఇస్లామిక్ వంశం వచ్చాక పర్షియన్ భాష, సంస్కృతిని యావత్ ఇరాన్ పీఠభూమికంతటికీ విస్తరింపజేశారు. ఈ కాలంలో పర్షియన్ సాహిత్యం, తత్వ శాస్త్రం, ఔషధం, జోతిష్యం, గణితం, కళల వికాసానికి విశేష కృషి జరిగింది. 12వ షియా ఇస్లామ్‌ను ఇరాన్ అధికార మతంగా ప్రకటించారు. ఇరానియన్ చరిత్రలో అతి ముఖ్యమైన మలుపు 1906లో పర్షియన్ తొలి పార్లమెంటు ఏర్పాటు. రాజ్యాంగ బద్ధమైన రాచరిక వ్యవస్థ పరిధిలోనే దీనిని ఏర్పాటు చేశారు. అయితే 1953 నాటికి వచ్చేసరికి అది నిరంకుశత్వం కిందికి పోయింది. ఇంగ్లండ్, అమెరికా ప్రోద్బలంతో తిరుగుబాట్లు, పెరిగిన విదేశీ ప్రాబల్యంపై ఇరానియన్లలో గూడుకట్టుకున్న అసంతృప్తి ఇవన్నీ చివరికి 1979లో ఇరానియన్ విప్లవానికి దారితీశాయి. ఫలితమే 1979 ఏప్రిల్1న ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ అవతరణ. 1980లో ఇరాన్ జాతీయ పతాకం, జాతీయ చిహ్నాలను రూపొందించుకున్నారు. ఐక్యరాజ్యసమితి, అలీనోద్యమం, ఒఐసి, ఒపెక్‌లలో ఇరాన్ వ్యవస్థాపక సభ్యరాలు. ఇరాన్ నూతన రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వంలో సుప్రీం లీడరే అత్యున్నతాధినేత. ప్రస్తుతం ఆ పదవిలో అల్ ఖొమైనీ ఉన్నారు. ఆ తరువాతి స్థానం అధ్యక్షుడు మహ్మద్ అహ్మదీ నెజాద్. ఇరాన్‌లో చట్టాలను ఇస్లామిక్ కన్సల్టేటివ్ అసెంబ్లీ (పార్లమెంటు) రూపొందిస్తుంది.


★




స్వాతంత్ర్యోద్యమం ఉచ్ఛస్థితిలో ఉన్న 1940 నాటి రోజులవి. డిగ్రీ పూర్తి చేసిన ఓ పంతొమ్మిదిన్నరేళ్ల కుర్రాడు బ్యాగ్ సర్దేసి లాహోర్ నుంచి బొంబాయి చెక్కేశాడు. సైన్యంలో రూ.150 నెలసరి వేతనంతో ప్రారంభమైన ఆ కుర్రాడి కెరీర్ ఆ తర్వాత వెండితెర వెలుగులలో తడిసి ముద్దయింది. ఆ చలాకీ కుర్రాడే దేవానంద్. సినీకళామతల్లి కంఠాభరణంలో మిలమిలా మెరుస్తూ నిత్యనూతన రంగులు వెదజల్లిన ఆ నవ కేతన ప్రేమతార గత ఆదివారమే నింగికెగిసింది. భారత చలనచిత్రానికి, ప్రత్యేకించి బాలీవుడ్‌కి పెద్ద బాలశిక్షలా ప్రశంసలందుకున్నారు. ఎవర్‌గ్రీన్ రొమాంటిక్ హీరో అని సినీజనం, అభిమానగణం కీర్తించింది. 88 ఏళ్ల ముదిమి వయసులోనూ 22 ఏళ్ల కుర్రాడి చలాకీతనం దేవానంద్‌కే సాధ్యమంటారు. ఆయన సాగించిన జీవన యానంలో కొన్ని ఘట్టాలను నెమరువేసుకుందాం.

# నిత్య నవకేతన ప్రేమతార

దేవానంద్ జీవితాన్ని పరికిస్తే అదో పెద్ద వ్యక్తిత్వవికాస పుస్తకంలా పాఠాలు నేర్పుతుంది. 65ఏళ్ల సుదీర్ఘ నటజీవితంలో 114 హిందీ సినిమాల్లో ఎవర్‌గ్రీన్ హీరోగా పేరు గడించినప్పటికీ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. నటగాయని సురయ్యాతో సాగించిన ప్రేమ ప్రయాణం 'మతం' అడ్డొచ్చి మధ్యలోనే ఆగిపోయింది. భగ్న ప్రేమ మనోవేదనను, ప్రేయసి ఎడబాటును మనసారా ఆస్వాదిస్తూ ముందుకడుగేశారు. ముఖానికి రంగు వేసుకోవడం కొనసాగించారు. రాజ్‌కపూర్, దిలీప్‌కుమార్ వంటి అగ్రశ్రేణి నటులతో ధీటుగా పోటీ పడుతూ రాణించారు. ప్రేమ విఫలమైతే ఆత్మహత్యలు చేసుకునే నేటితరం వైఖరిని ఆయన పూర్తిగా తప్పుబడతారు. జీవితాన్ని ప్రేమించి ఆస్వాదించాలని హితవు చెబుతారు. అలనాటి నటీమణులతోనే కాదు నవతరం హీరోయిన్లతోనూ చిందులేశారు. వయసు పైబడగానే తండ్రి పాత్రో, లేదా పెద్దన్న, మావయ్య పాత్రలో వేయడానికి సిద్ధపడలేదు. వయస్సు కప్పిపుచ్చడానికి ఆయన కెమెరా ముందు చేసిన యాక్షన్ కాస్త అతిగా అన్పించినా ముదిమి వయసులోనూ కథానాయకుడిగానే మురిపించారు. 'నవకేతన్' ఫిలిమ్స్ స్థాపించి 'కాలా పానీ', 'గైడ్' వంటి చిత్రరాజాలను తెరకెక్కించారు. ఆర్.కె.నారాయణ్ రాసిన 'గైడ్' పుస్తకప్రియులను ఆకట్టుకొన్నా ఆ కథను సామాన్య ప్రేక్షకుడిచేత ఒప్పించడం సులభం కాదు. అయినా మొండి ధైర్యంతో ఆ నవల ఎన్నుకొని కొన్ని మార్పులు చేసి అజరామర చిత్రంగా మల్చడం దేవానంద్ గొప్పదనం. చివరిరోజుల్లో దేవానంద్ తన దర్శకత్వంలోనే తెరకెక్కించిన 'ఛార్జిషీట్'కు ఆశించిన స్పందన కరువైంది. అయినా ఆయన ఏ మాత్రం నిరుత్సాహపడలేదు. 'ఈ చిత్రాన్ని తీసినందుకు ఎంతగానో గర్విస్తున్నా. 'గైడ్' కూడా ప్రారంభంలో పెద్దగా ఆడలేదు. తర్వాత దుమ్ము రేపింది' అనడం చూస్తే పరాజయాలను సైతం ఆయన ఏవిధంగా స్వాగతిస్తారో అర్థమౌతుంది. అదే ఆయన విజయమంత్రం.

**తెరిచిన పుస్తకం**

'స్టార్‌డమ్ అనేది ఐదేళ్లు, ఆరేడేళ్లు, లేదా గరిష్ఠంగా పదేళ్లు ఉంటుంది. ఆ తర్వాత మనమేమీ చేయకపోతే దానిని నిలబెట్టుకోవడం చాలా కష్ట'మనేవారు. నటించడంతో పాటు సినీనిర్మాతగా కూడా పనిచేయడం వల్లే తనకు మనుగడ సాధ్యమైందని చెప్పేవారు. 'రొమాన్సింగ్ విత్ లైఫ్' (జీవితంతో ప్రేమాయణం) పేరిట 2007లో దేవానంద్ తన ఆత్మకథను విడుదల చేశారు. మామూలుగా ప్రముఖుల ఆత్మకథలంటే అవి ఏ ప్రఖ్యాత రచయితతోనో ఎడిట్ చేయించి విడుదల చేస్తారు. కానీ దేవానంద్ అలా చేయలేదు. పుస్తకంలో తాను స్వయంగా రాసిన రాతలే ఉండాలని ప్రచురణకర్తలకు షరతు విధించారు. ఇంగ్లీషులో రాసిన తన ఆత్మకథను యథాతథంగా అచ్చు వేయించారు. 'ఇది నా భాష. నా శైలి. దేవానంద్ శైలి. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చొద్దు. అక్షర,భాషాదోషాలేవైనా ఉంటేనే సరిచేయండి. అంతేకానీ తిరగరాయొద్దు' అంటూ పబ్లిషర్లకి షరతు విధించానని ఓ సందర్భంలో ఆయన చెప్పారు. 'నాకు నేనుగా ఖండించే పని ఏదీ నా జీవితంలో నేను చేయలేదు. నా జీవితగాథ పూర్తి సచ్ఛీలం. శ్రేష్ఠం. తెరిచిన పుస్తకం' అంటూ ఓమోస్తరు స్వీయస్తుతి చేసుకున్నారు. అది దేవానంద్ శైలి మరి.

**ప్రేమాయణం**

దేవానంద్ ఓ పెద్ద ప్రేమతార. నటుడిగా అప్పుడప్పుడే అరంగేట్రం చేస్తున్న రోజుల్లోనే ఓ పెద్దతారపై మనసు పారేసుకున్నారు. ఆయన ప్రేమకథకు రోమియోజూలియట్, లైలామజ్నూ స్థాయికి ఏమాత్రం తీసిపోని మలుపులున్నాయి. పెద్ద నటిగా, ప్రఖ్యాత గాయనిగా సుస్థిర స్థానాన్ని చేజిక్కించుకున్న సురయ్యాతో దేవానంద్ తొలిసారి ప్రేమలో పడ్డారు. ఇరువురి కాంబినేషన్‌లో 'విద్య, జీత్, అఫ్సర్, నీలి, దో సితారే, సనమ్' చిత్రాలొచ్చాయి. అన్నీ బ్లాక్‌బస్టర్లే. 1948లో వచ్చిన 'విద్య' సినిమాలోని 'కినారే కినారే చలే జాయేంగే' పాట వారిని కలిపింది. ఆ పాటను ఓ సాగరంలో పడవపై చిత్రీకరిస్తుండగా సురయ్యా నీళ్లలో పడిపోయింది. ఆమెకు ఈత రాదు. దేవానంద్ వెంటనే నీళ్లలోకి దూకి ఆమెను రక్షించారు. 'మీరు కాపాడకపోతే నేనీలోకంలో ఉండేదాన్ని కాదు' అంటూ ఆమె కృతజ్ఞతాభావంతో చెబితే 'నీవే లేకుంటే నాకీ లోకంలో చోటెక్కడ' అని దేవానంద్ తన మనసులోని మాటను చెప్పేశారు. సురయ్యా కూడా దేవానంద్ మనసు అర్థంచేసుకొని పెద్ద నటినన్న గర్వం లేకుండా ఆయన ప్రేమను స్వాగతించింది. అలా ఇద్దరూ నీళ్లలోంచి బయటపడి ప్రేమలో మునిగారు.

అప్పట్లోనే మీడియాకు వీరి ప్రేమగాథ ఓ మృష్టాన్నం. విషయం సురయ్యా వారి ఇంట్లో తెలిసిపోయింది. వారిది సాంప్రదాయక ముస్లిం కుటుంబం. దేవానంద్ హిందువు. సురయ్యా అమ్మమ్మ వారి పెళ్లికి తిరస్కరించారు. పైగా దేవానంద్ ప్రేమతో ఇచ్చిన ఉంగరాన్ని సురయ్యా వేలి నుంచి లాగిపారేసి సాగరంలోకి విసిరికొట్టారు. 'జీత్' సినిమా సమయంలో పెళ్లికి ప్రపోజ్ చేసి సురయ్యాకు 3వేల రూపాయలు ఖర్చు చేసి కొనిచ్చిన ఉంగరమది. జీవితంలో ఆయన ఏడ్చిన సందర్భం అదొక్కటేనట. 'మా ప్రేమ విషయం అందరికీ తెలిసిందే. అప్పట్లో నేను కొత్తవాణ్ని. ఆమె పెద్ద స్టార్. సింగర్ కూడా. ఆమె లగ్జరీ కార్లలో వెళ్లేది. నేనేమో రైల్లో వెళ్లేవాణ్ని. ఆమె కళ్లు చాలా అందమైనవి. చాలా మంచిది కూడా. చాలా త్వరగానే ఇద్దరం మిత్రులమయ్యాం. అయితే సురయ్యా కుటుంబం చేతిలో జైలుపక్షి. నేనెంతో ప్రేమించా. నా తొలి ప్రేమ అదే. ఆమె కోసం కన్నీళ్లు కార్చా. అయినా పొందలేకపోయా. అయినా నాకు సంతోషమే. ఎందుకంటే జీవితవిధి విభిన్నమైనది. దానిని ఆస్వాదించాలి' అని ఓ సందర్భంలో గుర్తుచేసుకున్నారు. అయితే 1954లో కల్పన, దేవానంద్ రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. దేవానంద్ తుదిశ్వాస వరకు కల్పనే తోడుగా నిలిచారు. వీరికి ఒక కొడుకు, కూతురు. కొడుకు సునీల్ ఆనంద్ కూడా నటుడే. ప్రస్తుతం తన తండ్రి స్థాపించిన నవకేతన్ ఫిల్మ్స్‌పై నిర్వహణపైనే దృష్టి నిలిపారు. కూతురు పేరు దేవిన. గత ఆదివారం లండన్‌లో దేవానంద్ తుదిశ్వాస విడిచే సమయంలో సునీల్ ఆయన చెంతనే ఉన్నారు.

**పాఠాలు నేర్పే 'గైడ్'**

ప్రసిద్ధ నవలా రచయిత ఆర్‌కె నారాయణ్ రాసిన గైడ్ నవల కథాంశంతో దేవానంద్ గైడ్ అత్యద్భుతంగా తీశారు. అప్పటివరకు పాత చింతకాయపచ్చడిలా వస్తున్న హిందీ సినిమాలకు వైవిధ్యమైన శైలిని ఈ చిత్రం ద్వారా దేవానంద్ నేర్పారు. ఆ చిత్రాన్ని సినీజనాలకు మార్గదర్శిగా నిలిపారు. 1965లో వచ్చిన ఈ సినిమా తన నటజీవితంలోనే అత్యంత గొప్ప చిత్రమని దేవానంద్ అంటారు. 'నా మానసిక పరిపక్వతతో స్టేజ్‌కు వచ్చాను. నన్ను నేను నియంత్రించుకోవాలనుకున్నా. ప్రపంచానికి ఇతరులు చెప్పలేనిది నేను మాత్రమే చెప్పగలిగేది చెప్పాలనుకున్నా. అదే గైడ్. దీనిని నిర్మించేటప్పుడు ఆర్‌కె నారాయణ్‌తో మాట్లాడాను. కాలిఫోర్నియా నుంచి ఫోన్ చేసి దేవానంద్ మాట్లాడుతున్నా అన్నానాయనతో. 'ఏ దేవానంద్. ఓహో స్టార్. సినీ స్టార్' అన్నారాయన' అప్పటినుంచి మా బంధం దృఢమైంది. గైడ్ కోసం ఇద్దరం కలిసి లోకేషన్లు గుర్తించాం. ఇంగ్లీషులో తీసిన గైడ్‌కి, హిందీలో తీసిన గైడ్‌కీ చాలా వైవిధ్యముంది. రెండూ వేటికవే ప్రత్యేకమైనవి. నాకు హిందీ గైడ్ ఇష్టం. ఇంగ్లీషు వెర్షన్ అమెరికాలో కూడా విడుదలైంది. హాలీవుడ్‌లో పేర్గాంచిన పెర్ల్ ఎస్ బక్ వంటి పెద్దనటులను కలుసుకున్నా. అన్ని విధాలా నాకు గైడ్ ఎంతో సంతృప్తినిచ్చింది. గైడ్‌ను 35, 36 సార్లు చూసిన నా అభిమానుల్ని వ్యక్తిగతంగా వెళ్లి కలుసుకున్నా. వారితో ముచ్చటించా' అని ఓ ఇంటర్వ్యూలో దేవానంద్ మనసు విప్పారు.

నట జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ నిజమైన వైవిధ్యమైన తనదైన ప్రత్యేక శైలితో అలరించిన ధ్రువతార దేవానంద్. పరాజయాలొస్తే వాటికి ఎదురొడ్డి పాఠాలు నేర్చుకొని మరింత మిన్నగా కృషి చేసి విజయాలు సాధించిన అలుపెరగని బాటసారి. ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జన్సీ ప్రకటించినప్పుడు ఆమెకు వ్యతిరేకంగా పోరాటం మొదలెట్టి 'నేషనల్ పార్టీ ఆఫ్ ఇండియా' స్థాపించి రాజకీయ రంగులు కూడా చూశారు. తన జీవితంలో ఎన్నో మంచిచెడులను ఆస్వాదించిన దేవానంద్ నేడు మన కళ్లముందు నుంచి కనుమరుగయ్యారు. ఆయన గైడ్'లా నేర్పిన పాఠాలు, చూపిన దార్శనికత భారత సినీ వినీలాకాశంలో వెలుగులు విరజిమ్ముతూనే ఉంటాయి.

**- బి.అమర్‌నారాయణ**

## వివిధ సందర్భాల్లో దేవానంద్ చెప్పిన కొన్ని సంగతులు

★ నా అసలు పేరే నాకిష్టం. ధరమ్‌దేవ్ పిశోరీమాల్ ఆనంద్ నా పేరు. పేరు మార్చుకోవడం నాకిష్టముండదు. కొందరు సినీతారలు (ముస్లిం) పేర్లెందుకు మార్చుకుంటారో నాకు బోధపడదు.

★ ఇప్పుడు ఎవరైనా తారలైతే వెంటనే కొత్తకొత్త కార్లు కొనేస్తారు. నేను నెలకు రూ.365 వేతనంతో కెరీర్ ప్రారంభించా. అప్పట్లో నాకది చాలా పెద్ద మొత్తమే. ఇప్పుడు 365 రూపాయలకేమొస్తుంది? టిప్పులా ఇచ్చేటంత!

★ నాకు మహాత్మాగాంధీ హత్య గుర్తుంది. అప్పటికే నేను సినిమాల్లో నటునిగా నిలదొక్కుకున్నా. గాంధీ హత్యతో నాడు షూటింగ్‌లన్నీ నిలిపేశారు. హిందూముస్లిం ఐక్యతను చాటిచెబుతూ తీసిన 'హమ్ ఏక్ హై' చిత్రంలో నేను హిందూ పిల్లాడి వేషం వేశా. ఇప్పట్లో మతం అంశంతో సినిమాలు తీయడం అంత ఈజీ కాదు.

★ ఇప్పుడు సినిమాలంతా ఫ్లాష్‌లతో నడుస్తున్నాయి. దృశ్యాలన్నీ మెరుపులు, వెలుగుల జిలుగులతో దర్శనిమిస్తాయి. 200 మంది అమ్మాయిలతో సప్తవర్ణాల రంగుల వెలుగుల మధ్య చిందులేయించి తెరకెక్కిస్తున్నారు.

★ 1943లో సినిమాల మీద మోజుతో లాహోర్ నుంచి రైలులో బొంబాయి వచ్చేశాను. అప్పుడు నాకు పంతొమ్మిదిన్నర ఏళ్లు. నేనొదిలి వస్తున్న ప్రాంతం ఇండియా నుంచి వేరుబడుతుందని ఊహించలేదు. అయితే 55 ఏళ్ల అనంతరం నేను మళ్లీ లాహోర్ వెళ్లా. ఇరుదేశాల మైత్రికోసం నాటి ప్రధాని అటల్‌బిహారి వాజ్‌పేయితో కలిసి బస్సులో లాహోర్‌కు వెళ్లా. భారతీయ చిత్రాలన్నీ పాకిస్తానీయులు చూస్తారు. నాకెంతో గొప్ప అభిమానులున్నారక్కడ. వారితో నేను ముచ్చటించా. 'దేవ్ సాబ్ ఏదైనా ఓ పాట చెప్పండి. నేను నా పిల్లనగ్రోవిలో వినిపిస్తాను. మీ పాటలన్నీ నాకు వచ్చు' అని పిల్లనగ్రోవి వాయించే ఒక గాయకుడన్నప్పుడు నా మనసు గాల్లో తేలిపోయింది. చాలా ముచ్చటేసి పేరు అడిగా. ఆయన పేరు ఓ భారతీయుడిలానే ఉంది. భాష, యాస, హావభావాలు, ప్రతిదీ ఒకేలా ఉంది. ఇరుదేశాలదీ ఒకటే సంస్కృతి. పాక్‌ను విడదీసినప్పుడు విస్మయం చెందా. ఎందుకు విడదీయాలి అనుకున్నా. పాక్, బంగ్లాదేశ్, ఇవేవీ లేకుండా ఇవన్నీ కలిపి ఒకే ఇండియాలా ఉంటే ఎంత బాగుండు. ఊహించుకోండి'.

★ మా నాన్నే నాకు గొప్ప గురువు. ఆయన గొప్ప న్యాయవాది. అరబిక్, పర్షియన్, బైబిల్, గాయత్రీమంత్రం ఇవన్నీ నాచేత పఠింపజేసింది ఆయనే. నేను ఇంగ్లీషులో డిగ్రీ చేశా. మాస్టర్‌డిగ్రీ చేయొచ్చు. కానీ అప్పుడు నాన్న దగ్గర అన్ని డబ్బుల్లేవు. నాన్న బ్యాంకు ఉద్యోగం చేసుకో అని హెచ్చరించాడు. నేను స్వేచ్ఛగా విహరించాలనుకున్నా. సినిమాల్లోకి వెళ్లిపోవాలని, హీరో అయిపోవాలని నిర్ణయించుకున్నా. జేబులో రూ.30 ఉన్నాయ్. ఆ డబ్బుతో నాన్నకు బాయ్‌బాయ్ చెప్పి బొంబాయికి ట్రైన్ ఎక్కిశా. నా ప్రయాణం అలా మొదలైంది.




శరీరానికి వ్యాయామం అవసరం. ఏ రకం వ్యాయామం చేసినా మనిషిలోని ఆందోళన, వ్యాకులత తగ్గుతాయి. శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి బాధానివారిణులుగా బాగా పనిచేస్తాయి. శరీరంలో కొలెస్ట్రాల్, రక్తపోటు తగ్గుతుంది. అన్నింటికన్నా ముఖ్యంగా వ్యాయామం గుండెను కాపాడుతుంది. మొత్తంమీద వ్యాయామం మనిషిని ఉల్లాసంగా వుంచుతుంది.

# వ్యాయామంతో ఉల్లాసం

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

అబ్బా...పొద్దున్నే నిద్ర చెడగొట్టుకుని వ్యాయామం ఏం చేస్తాం? అనిపిస్తుంది. కానీ అలా చేస్తే ఎన్ని ఉపయోగాలున్నాయో చూద్దామా!

◆ వ్యాయామం రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ◆ వాకింగ్, జాగింగ్, డాన్సింగ్ ఏ వ్యాయామమైనా సరే ఎముకలను దృఢంగా వుంచుతుంది. ◆ఒత్తిడిని అధిగమించవచ్చు. ◆ హెమరాయిడ్స్, వెరికోస్ వెయిన్స్ వంటి సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. ◆ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రాత్రిపూట హాయిగా నిద్రపోవచ్చు. ◆ ఎముకలు, కీళ్ల దృఢత్వాన్ని పెంపొందించి ఆర్థ్రైటిస్ వంటి కీళ్ల జబ్బులు నయం అవుతాయి. ◆ డిప్రెషన్‌కు దూరం చేసి మంచి మూడ్‌లోకి తీసుకువస్తుంది. ◆ క్రమం తప్పకుండా చేసే ఏరోబిక్ వ్యాయామాలు గుండె మరింత సమర్థవంతంగా పనిచేసేలా చేయగలవు. ◆ గుండె, ఊపిరితిత్తులు బలోపేతమై చిరకాలం ఆరోగ్యంగా ఉంటారు. ◆ శరీరాన్ని ఎటు కావాలంటే అటు తీగలాగ వంచడానికి ◆ శరీర దారుఢ్యం మరింత పెరిగి శక్తిమంతులుగా తయారవుతారు. ◆ బరువు తగ్గుతారు. ◆ చక్కటి ఫిట్‌నెస్ సొంతమవుతుంది. మధుమేహం అదుపులోకి వస్తుంది. ◆ చర్మానికి, శిరోజాలకు మెరుపు వస్తుంది. కంటి కింద చారలు తగ్గుతాయి. ◆ అసలు వయసుకన్నా పది సంవత్సరాలు చిన్నగా కన్పిస్తారు. ◆ చర్మం ముడతలు పడదు. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ◆ నడక వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగవుతుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ◆ శ్వాసావయవాల పనితీరు మెరుగవుతుంది. గుండె జబ్బులు రాకుండా కాపాడుతుంది.

**వ్యాయామంగా క్రీడలు**

◆ టెన్నిస్ క్రీడ ఆడాలంటే చేతికి కంటికి మధ్య ఎంతో సమన్వయం కావాలి. ఈ ఆటలో ఉండే విపరీతమైన వేగం, వెంట వెంటనే దిశలు మార్చడం వంటి చర్యల వల్ల శరీరంలోని కొవ్వు కరిగి పోతుంది. ◆ ఎగరడం, దూకడం లాంటి పనుల వల్ల పిరుదులు, తొడలు, కాళ్ల కండరాలు టోన్ అప్ అయ్యి చక్కని ఆకృతికి వస్తాయి. ◆ వాలీబాల్ ఇసుకలో ఆడితే మంచిది. ఇసుకలో పరుగు కష్టం కాబట్టి శరీరంలోని కొవ్వు ఎక్కువ కరుగుతుంది. జట్టులో ఆడే క్రీడ కాబట్టి శరీరం, మనసు ఉత్తేజితం అవుతాయి. ◆ బ్యాడ్మింటన్ వల్ల చేతులు, భుజాలు, నడుము, కాళ్లు... మొత్తం శరీరం లబ్ధిపొందుతుంది. వేగంగా ఆడే ఈ ఆట శరీరాన్ని, మనసును ఉత్తేజపరుస్తుంది. ◆ ఈత వల్ల శరీరమంతా వ్యాయామంలో లగ్నమవుతుంది. ఈత శరీరానికి, మనసుకు కొత్త శక్తిని తెచ్చిపెడుతుంది. ఈత నేర్చుకున్న తర్వాత ఈ వ్యాయామానికి తయారుకావాలి. ◆ కదలకుండా ఉండే ఎక్సర్‌సైజు సైకిలయినా, లేదా మామూలు సైకిలయినా వేగంగా తొక్కితేనే శరీరంలోని కొవ్వు కరుగుతుంది. రోడ్డు మీద సైకిలు తొక్కేవారు ఎత్తుగా ఉండే రోడ్డుమీద తొక్కితే మంచిది. ◆ సైక్లింగ్ మొత్తం శరీరానికి ఉపయోగపడుతుంది. గుండెకు మంచిది. శరీరంలో కింది భాగం ఆరోగ్యంగా ఉంటుంది. ◆ నడక కన్నా జాగింగ్ చక్కటి వ్యాయామ క్రీడ. శరీరం కింది భాగం, పిరుదులు, తొడలు, కాలి మడమలకు ఎంతో మేలు చేస్తుంది. అవి సరైన తీరులో ఉండేందుకు ఉపయోగపడుతుంది. ◆ జాగింగ్ వల్ల గుండె సంబంధిత రక్తనాళాలు చక్కటి ఆరోగ్యాన్ని పుంజుకుంటాయి. ◆ ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నప్పుడు వ్యాయామం కోసం క్రీడల్లో పాల్గొనకూడదు.

**నడక ఉత్తమం**

◆ వ్యాయామాలన్నింటిలోనూ ఉత్తమ వ్యాయామం నడక. దీనివల్ల శరీరంలోని అన్ని భాగాలూ కదులుతాయి. ◆ వెన్నెముక, భుజాలు, చేతులు, కాళ్లు, గుండె, ఊపిరితిత్తులు, మెదడు.. అన్నింటికీ చక్కని వ్యాయామం. రక్త ప్రసరణ మెరుగవుతుంది. ◆ వాకింగ్ ఏ వయసువారైనా చేయొచ్చు. ◆ అనారోగ్యంతో ఉన్నవారు కూడా రోజుకి కనీసం పది, పదిహేను నిముషాలు అటూ ఇటూ నడవడం మంచిది. ◆ ఎప్పుడైనా వాకింగ్ చేయొచ్చు. ఉదయం ఐదు గంటలకు చేయడం వాంఛనీయం. ◆ పాదాలకు ఏమీ ధరించకుండా పచ్చిక మీద నడిస్తే మంచిది. సాధ్యం కానప్పుడు వాకింగ్ షూ వేసుకుని నడవాలి. ◆ రోజుకి కనీసం అయిదు కిలోమీటర్లు నడవాలి. సమయం 45 నుండి 60 నిమిషాలు పడుతుంది.

**నడక ముందు**

◆ నడకకు వెళ్లేముందు ఏమీ తినకుండా ఖాళీ కడుపుతో వెళ్లడం మంచిది. మధుమేహం ఉన్నవారు మాత్రం కాఫీ వంటి పానీయం ఏదైనా కొద్దిగా తాగి వెళ్లాలి. ◆ ఖాళీ కడుపుతో వెళ్లడం ఇష్టంలేనివారు ఒక గ్లాసు మంచినీళ్లు తాగొచ్చు. లేదా గోరు వెచ్చని నీటిలో ఒక చెక్క నిమ్మరసం పిండుకుని సేవించవచ్చు. ◆ భోజనం ముగించగానే వాకింగ్‌కి వెళ్లకూడదు. ◆ వాతావరణం బాగా వేడిగా/బాగా చల్లగా ఉన్నప్పుడు వాకింగ్‌కి వెళ్లకూడదు. ◆ వంటిమీది బట్టలు వదులుగా ఉండాలి. చెప్పులతో వాకింగ్ మంచిదికాదు. షూస్ ఉండాలి. వాకింగ్‌కు ట్రాక్‌సూట్ ధరించొచ్చు. ◆ ఇంట్లో అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో వాకింగ్‌కి వెళ్లడం కొంచెం ఇబ్బంది అనిపించినా వాకింగ్ పూర్తిచేసుకుని తిరిగి వచ్చినప్పుడు పొందే అనుభూతిని వర్ణించలేం.

**నడక ఎలా?**

◆ ప్రారంభం నుండి చివరి వరకూ ఒకే వేగంతో నడవాలి. ◆ నిటారుగా నిలబడి నడవాలి. ◆ ఊపిరి బలంగా తీసుకుని బిగబట్టి అడుగులేస్తూ నెమ్మదినెమ్మదిగా ఊపిరి వదలాలి. ◆ నడక ఆహ్లాదకరంగా ఉండాలి గానీ బాధాకరంగా ఉండకూడదు. ◆ నడిచేటప్పుడు చేతులు పక్షి రెక్కలు ఆడించినట్లు ఆడించాలి.

స్థూలకాయులు ఎవరినీ సంప్రదించకుండా వ్యాయామాలు చేస్తుంటారు. ఎంత ఎక్కువ సమయం వ్యాయామం చేస్తే అంత త్వరగా బరువు కోల్పోతామనుకుని అలా చేస్తుంటారు మరికొందరు. ఇలా చేస్తే ఆరోగ్యం బాగవడం మాట అటుంచి హృద్రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుందని వైద్య పరిశోధకులు చెప్తున్నారు. త్వరగా ఫలితాలు ఆశించి ఎక్కువ సమయం వ్యాయామాలు చేయవద్దని హెచ్చరిస్తున్నారు. నిపుణుల సలహాలు పాటిస్తూ వ్యాయామాన్ని పరిమిత సమయంలో ముగించాలి. అప్పుడు మంచి ఫలితాలు వస్తాయి.

✶

మూంగ్ హల్వా



పూరన్ పోళి

అనాస జీడిపప్పు హల్వా



గోరు మీఠీలు

ఖీమా హల్వా

## మూంగ్ హల్వా

**కావలసిన పదార్థాలు**

పెసరపప్పు - 2 కప్పులు
నెయ్యి - అర కప్పు
పంచదార - 1 కప్పు
కోవా - అర కప్పు
యాలకుల పొడి - పావు టీ స్పూను
జీడిపప్పు - 2 టీ స్పూన్లు
కిస్‌మిస్ - 2 టీ స్పూన్లు

**తయారు చేసే పద్ధతి**

పెసరపప్పు నానబెట్టి మెత్తగా రుబ్బుకోవాలి. అందులో పంచదార, నెయ్యి వేసి ఉడికించాలి. నెయ్యి చిందేవరకు ఉడికించిన తర్వాత కోవా, యాలకుల పొడి, నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ కలిపితే చాలు. మూంగ్ హల్వా రెడీ.

## పూరన్ పోళి

**కావలసిన పదార్థాలు**

మినపప్పు - 300 గ్రా॥
బియ్యం పిండి - 10 గ్రాములు
బెల్లం - 300 గ్రా
నెయ్యి - 4 టేబుల్ స్పూన్లు

**తయారు చేసే పద్ధతి**

మినపప్పు మెత్తగా ఉడకబెట్టి నీళ్లన్నీ వడగట్టాలి. వీటిని మెత్తగా పొడి చేసుకోవాలి. బెల్లం పొడి చెయ్యాలి. బియ్యంపిండిలో ఉడకబెట్టిన మినపప్పు పొడి, బెల్లం పొడి, ఒక స్పూన్ నెయ్యి వేసి కలపాలి. ఈ మిశ్రమానికి కొద్దిగా నీళ్లు చేర్చి పూరీ పిండిలా ముద్దగా కలుపుకోవాలి. ఈ ముద్దని చిన్న చిన్న ఉండలు చేసి పూరీల్లా వత్తుకోవాలి. వీటిని పెనంమీద నేతితో దోరగా వేయించాలి. ఇవి వేడివేడిగా తింటే రుచిగా ఉంటాయి.

## అనాస జీడిపప్పు హల్వా

**కావలసిన పదార్థాలు**

అనాస పండు తురుము - 4 కప్పులు
పచ్చికొబ్బరి తురుము - 1 కప్పు
పంచదార - 2 కప్పులు
జీడిపప్పు - అర కప్పు
కోవా - అర కప్పు
పైనాపిల్ ఎసెన్స్- 5 చుక్కలు
నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు

**తయారు చేసే పద్ధతి**

బాదంపప్పు, జీడిపప్పు, పిస్తాపప్పులు నేతిలో దోరగా వేయించి పక్కన పెట్టాలి. అదే పాత్రలో అనాసపండు తురుము, కొబ్బరి తురుము విడివిడిగా పచ్చివాసన పోయేవరకు నేతిలో వేయించాలి. తర్వాత ఈ రెండింటిని కలిపి అందులో పంచదార వేసి ఐదు నిమిషాలు ఉడకబెట్టాలి. ఈ మిశ్రమానికి కోవా కలిపి రెండు నిమిషాలు ఉడికించి దించాలి. దీనిపైన వేయించిన జీడిపప్పు, పిస్తాపప్పు, బాదంపప్పులను వెయ్యాలి. అంతే రుచికరమైన అనాస జీడిపప్పు హల్వా రెడీ.

## గోరు మీఠీలు

**కావలసిన పదార్థాలు**

మైదా - 2 కప్పులు
బొంబాయి రవ్వ - 2 కప్పులు
పంచదార/బెల్లంపొడి - 4 కప్పులు
బేకింగ్ పౌడర్ - 1 టేబుల్ స్పూన్
నూనె - వేయించడానికి సరిపడా
వెన్న - 2 టేబుల్ స్పూన్లు

**తయారు చేసే పద్ధతి**

మైదాలో బొంబాయిరవ్వ, వెన్న, బేకింగ్ పౌడర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమానికి కొద్దిగా నీళ్లు చేర్చి చపాతీ పిండికంటే కొంచెం పలుచగా కలుపుకుని అరగంట నాననివ్వాలి. పిండి నానిన తర్వాత దాన్ని చిన్న చిన్న వుండలు చేసుకోవాలి. చూపుడు వేలు మధ్య వేలు మధ్యలో ఉండను తీసుకుని బొటనవేలితో నొక్కుతూ పొడవుగా చెయ్యాలి. వీటిని బాగా కాగిన నూనెలో బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. ఓ గిన్నెలో పంచదార/బెల్లం తీసుకుని కొద్దిగా నీళ్లు పోసి ఉండపాకం పట్టాలి. నూనెలో వేయించుకున్న గోరుమీఠీలను పాకంలో వేసి కలియదిప్పాలి. పిల్లలే కాదు పెద్దలు కూడా వీటిని చాలా ఇష్టంగా తింటారు.

## ఖీమా హల్వా

**కావలసిన పదార్థాలు**

మీల్ మేకర్ - అర కిలో
క్యారెట్/ బీట్‌రూట్ తురుము - 1 కప్పు
జీడిపప్పు, కిస్‌మిస్ - 25 గ్రాములు
పంచదార - 1 కప్పు
ఇలాచీ పొడి - చిటికెడు
నెయ్యి - 100 గ్రాములు
పాలు - 2 కప్పులు

**తయారు చేసే విధానం**

మీల్‌మేకర్‌లో కొద్దిగా ఉప్పేసి మెత్తగా ఉడకబెట్టాలి. దీన్ని మిక్సీవేసి ఖీమాలాగా చేసుకోవాలి. జీడిపప్పు, కిస్‌మిస్, క్యారెట్/ బీట్‌రూట్ తురుము విడివిడిగా నేతిలో వేయించాలి. బాండీలో పాలు పోసి బాగా మరిగించాలి. అందులో వేయించిన క్యారెట్/బీట్‌రూట్ తురుము, ఉడికించిన మీల్ మేకర్ ఖీమా, పంచదార, ఇలాచీ పొడి వేసి మెత్తగా ఉడికించాలి. ఇలా నెయ్యి పైకి తేలేవరకూ ఉడికించాలి. దించేముందు వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ వేయాలి. చల్లారాక తింటే చాలా రుచిగా ఉంటుంది.

## ఎవరబ్బా!

బుజ్జాయిలూ...ఈ బొమ్మలో మీకు ఓ అమ్మాయి ముఖం కనిపిస్తోంది కదూ! కానీ జాగ్రత్తగా చూడండి. ఇక్కడ ఇంకా కొన్ని ముఖాలున్నాయి. ఇంతకీ ఈ బొమ్మలో మొత్తం ఎన్ని ముఖాలున్నాయో చెప్పండి.

జవాబు: 10

## కవలలు ఏవి?

హాయ్.. ఇక్కడ ఆరు చక్రాలున్నాయి! అన్నీ చూడ్డానికి ఒకేలా కనిపిస్తున్నాయి. కానీ వాటిలో రెండు మాత్రమే కవలలు. అవేంటో కనిపెట్టి సున్నా చుట్టేయండి.




జవాబు: 2,6

# తలకిందులు పక్షి

పిల్లలూ... ఈ వారం మన ముందుకొచ్చిన పక్షి పేరు రాజహంస. ఇది లేత గులాబి, తెలుపు రంగులు కలిసిన పక్షి. దీనివి ఎర్రటి పొడవాటి కాళ్లు. మెడ పాములా మెలిక తిరిగి ఉంటుంది. దీని పొడవెంతో తెల్సా? సుమారు ఒకటిన్నర మీటర్లు. ముక్కు లేత ఎరుపు రంగులో చివరి సగభాగం నల్లగా వంపు తిరిగి దువ్వెనలా ఉంటుంది. బాతుకి ఉన్నట్లు దీని కాలివేళ్లమధ్య కూడా చర్మం ఉంటుంది. దీని రెక్కలు ఎర్రగా ఉంటాయి. ఎగురుతున్నప్పుడైతే ఈ రెక్కలు నల్లని అంచుతో మెరుస్తూ చూడ్డానికి చాలా బావుంటాయి. ఇవి భారతదేశం, పాకిస్తాన్, శ్రీలంకలో నివశిస్తాయి. తటాకాలు, ఉప్పునీటి సరస్సులు, నదీ ముఖద్వారాల దగ్గర మందలు మందలుగా కనిపిస్తాయి. ఇది వలస పక్షి. ఆహారాన్ని వేటాడ్డానికి లోతు లేని నీళ్లలో మెడ మాత్రమే వంచి తల పూర్తిగా నీళ్లలో ముంచుతుంది. వంపు తిరిగిన దాని ముక్కు ఆహార సేకరణలో బాగా ఉపయోగపడుతుంది. అదే సమయంలో నీటి అడుగున వున్న ఆహారాన్ని అందుకోడానికి తలకిందులుగా మునుగుతుంది. తోక చివరి భాగం మాత్రం నీటిపై తేలుతుంది. ఇది నీటిలో ఈదగలదు. గాలిలో ఎగరగలదు. రెక్కలు వేగంగా కొట్టుకుంటూ, మెడను ముందుకు చాచి అలలుఅలలుగా ఎగురుతుంది. కాళ్లను తోక భాగంలో ముడిచిపెడుతుంది. రాజహంస ఎప్పుడూ చాలా నిశ్శబ్దంగా ఉంటుంది కానీ ఆహారం తీసుకునేటప్పుడు మాత్రం మిగతా పక్షులతో కలిసి గోలచేస్తుంది. ఇది అక్టోబర్ - మార్చి మధ్య కాలంలో గుడ్లు పెడుతుంది. మన దేశంలో ఒక్కటంటే ఒక్కప్రదేశంలోనే గుడ్లను పెడుతుందట. ఆ స్థలం పేరు 'గ్రేట్ రాన్ ఆఫ్ కచ్'.

అయ్యో... చూడండి. ఏం చేస్తున్నారో!! పెద్దచెట్లన్నింటినీ కొట్టేసి, కుండీల్లో చిన్న చిన్న మొక్కలు పెంచుతున్నారు!





## ఏది ఎక్కడ?

ఫ్రెండ్స్... పైన ఓ పువ్వు బొమ్మ ఉంది. పక్కనే దానికి సంబంధించిన విడి భాగాలు ఉన్నాయి. ముందు ఆ భాగాల్ని విడివిడిగా కత్తిరించండి. వాటిని ఎలా అమరిస్తే సరిగ్గా పువ్వు ఆకారం వస్తుందో చూసి పెట్టేసెయ్యండి.



## దేని విలువ ఎంత?

హాయ్...పైన మూడురకాల ఆకారాలున్నాయి. కాకపోతే ఒక్కోదానికి ఒక్కో విలువ ఉంది. +,-,x లను బట్టి ఏ గుర్తుకి ఏ విలువ వుంటుందో లెక్కగట్టి చెప్పండి.

## ఇదేమిటో...!?

హలో ఫ్రెండ్స్...పక్కనున్నదేంటో తెలుసా? ఇదేదో షీల్డులా ఉంది అనుకుంటున్నారా!? అలా అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్లే. ఇది ఓ దేశపు లోగో. అదేశం పేరేమిటో మీరు చెప్పాలి. క్లూ ఏంటంటే... దీని మధ్యలో ఉన్న జంతువే. ఇప్పుడు చెప్పండి.

## రంగులు నింపేద్దాం

చిన్నారులూ...ఈ బొమ్మ భలేగా ఉంది కదూ. దీనికి రంగులేస్తే మరింత బాగుంటుంది. మరెందుకాలస్యం? చకచకా వేసేయండి.

## అదొక్కటే!



(మూడు చీమలు రోడ్డుమీద వెళ్తుంటే వాటికి ఎదురుగా ఓ ఏనుగు వస్తూ కనిపించింది)

మొదటి చీమ : ఏనుగు మనకే అడ్డొస్తుందా! చంపేద్దాం.

రెండవ చీమ : ఇలా మనకు ఎప్పుడూ అడ్డు రాకుండా దాని కాళ్లు విరగ్గొడదాం.

మూడవ చీమ : వదిలేయండర్రా! అది ఒక్కటి. మనం ముగ్గురం. ఏనుగులు కూడా మూడు ఉన్నప్పుడు వాటి పని పడదాం.

## class

టీచర్ : చింటూ class అంటే ఏంటో చెప్పు?

చింటూ : C అంటే Come, L అంటే Late, A అంటే And, S అంటే Start, S అంటే Sleeping టీచర్.

## మంచి డాక్టర్

డాక్టర్ : నువ్వు ఇంకో రెండు గంటల్లో చనిపోతావు. చివరిగా ఎవర్నైనా చూడాలనుకుంటున్నావా?

పేషెంట్ : ఓ మంచి డాక్టర్ని చూపించండి.

## స్పీడ్ బ్రేకర్లు

(రైల్వే ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి)

ఇంటర్వ్యూ చేసే వ్యక్తి : రైలు యాక్సిడెంట్లు నివారించాలంటే ఏం చెయ్యాలి?

అభ్యర్థి : పట్టాల మీద మధ్య మధ్యలో స్పీడ్ బ్రేకర్లు కట్టాలి.



- ఇంజమాముల్ షరీఫ్,

7వ తరగతి, గౌతమ్ మోడల్ స్కూల్, హైదరాబాద్.

# మాటల కోట - 79

రూపకల్పన : కొమ్మాలపాటి



## అడ్డం

1. 'హరేరామ... హరేకృష్ణ' చిత్ర సృష్టికర్త. బాలీవుడ్ ఎవర్‌గ్రీన్ హీరో (4)
3. కిరణ్‌కుమార్ ప్రభుత్వంపై అసెంబ్లీలో చంద్రబాబు పెట్టిన తీర్మానం (4)
6. 'సారము' లేని వాదనలేల! (2)
7. తోటి (2)
8. 'పట్టు'కుంటే వదలరు కొందరు (3)
9. ... బుల్లోడా! దుమ్ము.... బుల్లోడా! కొద్దిగా మారింది (3)
10. 'ర' గుణింతంలో 3,4 అక్షరాలు (2)
11. 'అంటకాగు'లో రెండవ పదం (2)
13. నత్తి ఉన్న వారు 'ఉసిరి'ని పిలిస్తే. అటునుంచి (3)
14. ప్రాణం (3)
15. పిడుగు చిందరవందరైతే (3)
16. ఇంటికి దీపం ఈవిడే (3)
17. భార్య (2)
19. దశకము (2)
20. సమాధి (2)
21. ఇది సరిగ్గా లేకపోతే నిద్ర పట్టదు. అటునుంచి (2)
22. చెడు (2)
23. రాముణ్ణి పిలవండి (2)
24. 'యుద్ధము శాంతి' నవలా రచయిత (4)
25. రాష్ట్రం ఈ జ్వరాలతో వణికిపోతోంది (4)

## నిలువు

1. కల్పవృక్షము (5)
2. చూసి చేసినది. రాసినది (3)
3. నిలువు రెండుకు పూర్తి విరుద్ధమైనది (3)
4. ఊపిరి (2)
5. ధర్మజుని కడగొట్టు తమ్ముడు (5)
6. .... ఆడు మాట పాడియై చెల్లున్ (4)
10. చర్మము మీద కంది గింజంత ఆకారంలో కనిపించేది (4)
12. పూర్వకాలపు డబ్బులు (3)
14. సంతోషం (3)
17. మొట్టమొదటి (2)
18. అయ్యో! (3)
19. పోరాడి సాధించుకున్న... ఆహార పథకం దీని కోసమే (2)
20. పశువులపై పారాడే పేను (3)
21. జాతీయ భాషలో పండు. తొలి అక్షరంలో వత్తు లోపించింది (2)
22. తెల్సినవారు కనపడగానే మన నోటి నుంచి వెలువడే పలకరింపు (2)
23. రాలేదని చెప్పండి (2)

### మాటలకోట - 78 జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1. బి | ర | 2 డా | | 3 పూ | ర | ణ | 4 ము |
| 5 క | య్యం | | కి | | 6 దం | 7 దా | | న్నా |
| లు | | 8 మా | ని | 9 కొం | డ | | 10 జా | రు |
| 11 పు | ల్లె | ల | | కి | | 12 పా | గా | |
| | 13 ప | పి | పూ | | 14 రా | ణి | | 15 న |
| 16 షో | | ల్ల | | 17 క | రా | | 18 మా | వ |
| | 19 వే | | 20 ధ | ర్మ | జు | డు | | మా |
| 21 దో | మ | 22 తె | ర | | | వు | | సా |
| 23 సె | న | గ | | 24 ఏ | కో | 25 ద | రు | లు |

## నిద్ర

**శ్రీకాంత్:** డాక్టర్‌గారూ! నాకు ఈ మధ్య సరిగ్గా నిద్ర రావడం లేదు. మందులేవైనా వుంటే ఇవ్వండి.

**డాక్టర్:** చూడండి. నిద్ర పట్టడానికి మంచి వాతావరణం అవసరం. చక్కని మెత్తటి పరుపు, ఎత్తైన దిండు , అగరుబత్తి పొగలు, నీలంరంగు కాంతి బల్బు, కిటికీలకు మంచి కర్టెన్లు వేసుకుంటే నిద్ర దానంతట అదే వచ్చేస్తుంది.

**శ్రీకాంత్ :** ఆఫీసులో ఇవన్నీ ఎక్కడ కుదురుతాయి డాక్టర్.

హ్హా... హ్హా...

## న్యూస్ రీడర్

**శివ :** మా నాన్న మాట్లాడితే యావత్ రాష్ట్ర ప్రజలు వింటారు తెలుసా?

**బన్ని :** మీ నాన్న రాజకీయ నాయకుడా?

**శివ :** కాదు. న్యూస్ రీడర్.

# ప్రతిభ



అదొక వీధి కుక్క. ఊరంతా తిరిగి దొరికిందేదో తినేది. ఎక్కడో ఓచోట ముడుచుకుని పడుకునేది. అలా రోజులు గడుస్తున్నాయి. దసరా పండుగ వచ్చింది. నవరాత్రులప్పుడు ఆ ప్రదేశమంతా ఉత్సవాలతో సందడిగా ఉంది. ఈ సందర్భంగా దానికి రోజూ విందు భోజనాల దగ్గర కడుపు నిండా ఆహారం దొరుకుతుంది. రాత్రి పూట కళాకారులు చేసే మిమిక్రీ, వినోద కార్యక్రమాలు దానికి బాగా నచ్చాయి. వాటిని చూసినప్పటి నుండి వివిధ రకాల జంతువుల్ని, పక్షుల్ని అనుకరించి మాట్లాడ్డం మొదలుపెట్టింది.

ఒకరోజు అడవికి వెళ్లింది. ఓ వ్యాపారి నడిచి వస్తుంటే చెట్టు చాటున నిలబడి "గాండ్రు.. గాండ్రు..." మంది. ఆ వ్యాపారి నిజంగానే సింహం వచ్చిందనుకుని ప్రాణభయంతో పారిపోయాడు. పరుగెత్తుతుంటే జేబులోని మనీ పర్సు కిందపడ్డది. దాన్ని అందుకుని ఊళ్లోకి వచ్చింది. ధనయ్యనే దర్జీ దగ్గరికెళ్లి తనకొక డ్రస్సు కుట్టమని డబ్బిచ్చింది. ధనయ్య జోకర్ డ్రస్సు కుట్టి కుక్కకు తగిలించాడు. అది కుక్కకు సరిగ్గా సరిపోయింది.

"ఎందుకీ డ్రస్సు?" అడిగాడు.

"నేను మిమిక్రీ చేస్తాను. జనం చూడాలంటే ఏదో ఒక ప్రత్యేకమైన దుస్తులుండాలి కదా. అందుకు" అంది.

"నువ్వు కుక్కవు. అందునా మిమిక్రీ చేయగలవు. నిన్ను చూసి ఈర్ష్యపడేవాళ్లుంటారు. మనుషులు నిన్ను బాధించే ప్రమాదం కూడా వుంది. నా కొడుకు రమేష్ ఖాళీగా వుంటున్నాడు. ప్రస్తుతం నిరుద్యోగి. నీతో ప్రదర్శనలు ఇప్పిస్తూ నిన్ను చక్కగా చూసుకుంటాడు. నిన్ను అన్ని విధాలా రక్షిస్తాడు. నీకు సమ్మతమేనా?" అనడిగాడు దర్జీ.

"అవును. ఈ మనుషులకు ఆనందమొచ్చినా, కోపమొచ్చినా పట్టలేం. సరే మీ అబ్బాయిని రమ్మను. నాకూ ఓ యజమాని ఉన్నట్లుంటుంది" అంది కుక్క

రమేష్ కుక్క మెడకు గొలుసు కట్టి పాఠశాలల్లో, ఉత్సవాల్లో ప్రదర్శనలు ఇప్పించసాగాడు. దాని మిమిక్రీ మెచ్చుకుని జనం తోచినంత డబ్బు ఇచ్చేవారు. దానితో కుక్కకు ఆహారం కొనిస్తూ, తనూ పొట్ట పోసుకుంటున్నాడు.

క్రమేపీ రమేష్‌లో స్వార్థం పెరిగింది. వచ్చిన పైకంలో పది శాతం కూడా కుక్కకు ఖర్చుపెట్టకుండా, మొత్తం తనే వాడుకోవడం మొదలుపెట్టాడు. ఒక్కోసారి కుక్క అర్థాకలితో నిద్రపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆహారం సరిపోవట్లేదని అడిగితే కర్రతో కొట్టేవాడు. ఆకలి బాధ భరించలేక ఎలాగైనా రమేష్‌ని వదిలించుకోవాలనుకుంది.

ఒకరోజు రమేష్‌తో "ఎన్ని ప్రదర్శనలిచ్చినా ఎక్కువ డబ్బులు రావడం లేదు. మనం అడవికి వెళ్దాం. నేను పులిలా మిమిక్రీ చేస్తాను. మనుషులు భయపడి పారిపోతుంటే వారి దగ్గరున్న డబ్బులు, నగలు నువ్వు దోచుకుందువు. అలాగైతే చాలా తర్వగా ధనవంతుడివవుతావు" అని ఆశ పెట్టింది కుక్క

"వెంటనే వెళదాం. నాకు చాలా డబ్బు కావాలి" అన్నాడు రమేష్ మరో ఆలోచన లేకుండా.

రమేష్‌ను అడవికి తీసుకుపోయి "నువ్వా చెట్టుచాటున వుండు. నేను నీ ఎదురుగా ఈ చెట్టు వెనక దాక్కుంటాను. మనిషి కనపడగానే పులిలా అరుస్తాను. వాడు పారిపోతుంటే, మీదపడి పర్సు లాక్కో" అంది చెట్టుమీద నిద్రపోతున్న చిరుతను చూసి.

అలాగే అంటూ చెట్టు చాటున నక్కి రాబోయే మనిషి కోసం బాట వైపు చూడసాగాడు.

చెట్టుమీది చిరుత పులి, మనిషి వాసన పట్టి, మెల్లగా కిందికి దిగింది. చిరుత దగ్గరకొచ్చాక చూశాడు రమేష్? "అమ్మో చిరుత పులి" అరుస్తూ శక్తి కొద్దీ పరుగెత్తాడు. కానీ దాని వేగం ముందు మనిషి వేగమెంత? అమాంతం రమేష్ మీదకి దూకింది. రమేష్ ఎంత పెనుగులాడినా, దాని బలం ముందు గెలవలేకపోయాడు. మెడపట్టి కొరికి చంపి తినేసింది.

తన కళతో బతుకుతూ, తనను హింసించిన మనిషికి సరైన గుణపాఠం చెప్పానని హాయిగా నిట్టూర్చింది. తర్వాత అదే అడవిలోని రేచు కుక్కల గుంపులో కలిసి పోయింది. అయితేనేం! అప్పడప్పుడు అడవి జంతువులను అనుకరిస్తూ తన మిమిక్రీతో సంతోషపరుస్తూనే ఉంది.

- పుప్పాల కృష్ణమూర్తి

# కొప్పు చూడ తరమా!

జుట్టున్నమ్మ ఏ కొప్పయినా పెడుతుందని పెద్దలు ఏనాడో చెప్పారు. అమ్మలే కాదు! అయ్యలది కూడా అదే రూటు!! అయినా పెద్దలు ఇలాంటివారిని ఎందరిని చూచి చెప్పారో కదా ఆ మాట అనిపించకమానదు.

సరేగాని! ఆకాశంలో తిరగాడే ఓ నల్లటి మేఘానికి మనిషి నెత్తిమీద తిష్ట వేయాలన్న ముచ్చట వేసిందనుకో! ఏమౌతుంది? దూదికాయ నుంచి ఓ గింజ వేరుపడి గాలిలో తేలుతూ వుంటే ఎలా వుంటుంది? తల చుట్టూ పొడవాటి కొమ్ములొస్తే! నడినెత్తిమీద చాకుల్లా వెంట్రుకలు నిలబడితే! తలంతా నున్నగా వుండి రెండు పిడికిళ్ల వెంట్రుకలు మాత్రమే రెండు చోట్ల మిగిలితే! మాడు మీద కళ్లజోడు మాదిరి కటింగ్ చేస్తే! అబ్బాయి నెత్తిమీద బార్బర్‌కు ముగ్గు వేయాలనిపిస్తే! నెత్తిమీద వెంట్రుకలన్నీ నిట్టనిలువుగా నిలబడితే! చిన్నసైజు గడ్డివాము ఒకటి తల మీద సెటిలైపోతే! వంటి ఊహలకు వాస్తవ రూపాలే వీరంతా! కాకపోతే కొప్పులన్నీ చూచి ఆనందించడానికేనండోయ్! ఏవంటారు?!